

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

## సచివాలయ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ కల్పించాలి: అచ్చెన్న

అమరావతి: కరోనా బారిన పడి సచివాలయ ఉద్యోగులు మరణిస్తున్నా జగన్‌కు పట్టడం లేదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సచివాలయ ఉద్యోగులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. కరోనాతో సాధారణ పరిపాలనశాఖ డేటా ఎంట్రీ ఆపరేటర్ కిషోర్ కుమార్ మృతి బాధాకరమని అన్నారు. ఇప్పటి వరకు కరోనా సోకి 8 మంది ఉద్యోగుల మరణించినా ముఖ్యమంత్రి జగన్ రెడ్డికి పట్టడం లేదని విమర్శించారు. వందలాది మంది ఉద్యోగులకు కరోనా సోకిందని తెలిపారు. కరోనా నియంత్రణలో విఫలమైన ప్రభుత్వం.. ఉద్యోగుల భద్రతను కూడా గాలికి వదిలేసిందని వ్యాఖ్యానించారు. సచివాలయ ఉద్యోగులందరికీ వర్క్ ఫ్రమ్ హోం కల్పించాలని.. మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు.

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి శుక్రవారం 30 ఏప్రిల్ 2021 సంపుటి : 02 సంచిక : 290 పేజీలు : 4 వెల : రూ 3-00

# మనసా వాచా కర్మణా 'స్వచ్ఛ సంకల్పం చేయాలి: సీఎం జగన్



### జల్‌జీవన్ మిషన్, జగనన్న పల్లె వెలుగు, జగనన్న స్వచ్ఛ సంకల్పం, క్లీన్ ఆంధ్రప్రదేశ్‌పై సమీక్ష

అమరావతి ( విభారె) : 'జగనన్న స్వచ్ఛ సంకల్పంకార్యక్రమంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష చేశారు. గ్రామాల్లో పారిశుద్ధంపై కార్యాచరణ (జగనన్న స్వచ్ఛ సంకల్పం)తో పాటు, వైఎస్సార్ జలకళ, గ్రామీణ తాగునీటి సరఫరా (జల్‌జీవన్ మిషన్–జేజేఎం), వీధుల్లో ఎల్‌ఈడీ లైటింగ్ (జగనన్న పల్లె వెలుగు), గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణంపై సమీక్ష జరిపారు. సమీక్ష సమావేశంలో సీఎం జగన్ అధికారులు కీలక ఆదేశాలు జారీ చేశారు. 'పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శానిటేషన్ చాలా ముఖ్యం. క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్).. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ జయంతి రోజు జూలై 8న ప్రారంభం అవుతుందివ అని సీఎం జగన్ తెలిపారు. గ్రామాల్లో ఎక్కడా మురుగునీరు కనిపించకూడదని స్పష్టం చేశారు. సీవేజ్ పంపింగ్ ఎలా ఉంది? ఆ నీటిని ఎలా డిస్పోస్ చేయడం ఎలా అనేది చూడాలని అధికారులకు సూచించారు. మురుగునీటిని ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి మున్సిపాలిటీ, పంచాయతీలలో పారిశుద్ధ్య కార్మికులకు వాక్సినేషన్ మొదలు, యూనిఫామ్, గ్లౌజ్‌లు, మాస్క్‌లు, కోట్స్ అన్నీ అదనంగా ఇవ్వాలని స్పష్టం చేశారు. 'మన ఊరును మనమే పరిశుభ్రంగా చేసుకుందాంవ అనే నినాదంతో జగనన్న స్వచ్ఛ సంకల్పం అమలుచేయాలని సీఎం జగన్ స్పష్టం చేశారు. ఈ–వాహనాల నిర్వహణ భారం కాకుండా చూసుకోవాలని, గ్రామాల్లో పారిశుద్ధం, తాగునీరు, వీధి దీపాలపైనే ఎక్కువ వ్యయం చేయాలని తెలిపారు. 'క్లీన్ ఆంధ్రప్రదేశ్‌వలో గ్రామాలు, పట్టణాల్లో పూర్తి పారిశుద్ధం కోసం మున్సిపల్ విభాగం కూడా పంచాయతీరాజ్‌తో కలిసి పని చేయాలని సూచించారు. మనసా వాచా కర్మణా ఈ కార్యక్రమాన్ని సొంతం చేసుకోవాలని చెప్పారు. మే 1వ తేదీ నుంచి వంద రోజుల పాటు గ్రామాల్లో పారిశుద్ధంపై కార్యాచరణ చేపడుతున్నట్లు సమావేశంలో అధికారులు వెల్లడించారు.వైఎస్సార్ జలకళ: ఈ పథకంలో రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల బోర్లు వేయాలని నిర్ణయం. చిన్న, మధ్య తరహా రైతులకు 1.5 లక్షల పంప్‌సెట్లు ఇవ్వాలని, దీంతో 3 లక్షల రైతులు ప్రయోజనం పొందుతారని అంచనా. 5 లక్షల ఎకరాలను సాగునీరు అందుతుందని లెక్క. బోర్ వేయాలని ఏ రైతు దరఖాస్తు చేసినా, ఎప్పుడు ఆ బోర్ వేస్తామన్నది స్పష్టంగా చెప్పాలి. దీనికి ఎస్‌ఓపీ ఖరారు చేయండి. ఇచ్చిన తేదీన కచ్చితంగా బోరు వేయాలి. ఆ తేదీ మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ మిస్ కాకూడదు. తేదీ ఇస్తున్నామంటే, కేవలం బోరు వేయడం మాత్రమే కాదు. నీరు పడిన తర్వాత కచ్చితంగా నెల రోజుల లోపు, విద్యుత్ కనెక్షన్ ఇచ్చి, పంప్‌సెట్ బిగించాలి. సొంతంగా బోర్లు వేసుకున్న రైతులు ఎవరైనా పంప్‌సెట్‌లు కోరితే వారికి కూడా ఇవ్వండి. ఆ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, ఇంధన శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలి. ప్రతి నియోజకవర్గంలో నెలకు కనీసం 20 బోర్లు వేయాలి.గ్రామీణ తాగునీటి సరఫరా (జల్‌జీవన్ మిషన్– జేజేఎం): జగనన్న కాలనీల్లో కూడా ఈ కార్యక్రమం అమలు చేయాలి. నీటి వనరు, సరఫరా రెండూ ముఖ్యమే. జగనన్న కాలనీల్లో జల్‌జీవన్ మిషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. వేసవిలో నీటి వినియోగంపై ముందే పక్కాగా ప్రణాళిక సిద్ధం చేయాలి. ప్రతి గ్రామంలో ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. ఆ మేరకు ఏటా ఎప్పుడెప్పుడు, ఏయే ట్యాంకుల్ క్లీన్ చేయాలన్న దానిపై ఒక ప్రొటోకాల్ రూపొందించుకోండి. ఏటా వేసనికి ముందే అన్నీ పక్కాగా ప్లాన్ చేయాలి. వీధుల్లో ఎల్‌ఈడీ లైటింగ్ (జగనన్న పల్లె వెలుగు): వీధి దీపాలు ఎల్‌ఈడీ వాడకంతో యేటా దాదాపు రూ.160 కోట్ల మేర ఆర్థిక ప్రయోజనం కలుగుతుంది. దాదాపు 4 లక్షల దీపాలు కావాలి. ఆ మేరకు కార్యాచరణ సిద్ధం చేయండి. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు: ఏపీ రూరల్ రోడ్ కనెక్టివిటీ ప్రాజెక్టు (ఏపీఆర్‌ఆర్‌పీ)– ఈఏపీ 30 ఏళ్లుగా 30 వేల కి.మీ. బీటీ రోడ్లు మాత్రమే ఉండగా, మనం అధికారంలోకి వచ్చాక 10 వేల కి.మీ రహదారుల నిర్మాణం జరుగుతోందని అధికారులు సీఎంకు వివరించారు. ఈ సమావేశానికి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పర్యావరణ అటవీ శాఖ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి కమిషనర్ గిరిజాశంకర్, ఇంధన శాఖ కార్యదర్శి శ్రీకాంత్, మున్సిపల్ శాఖ స్పెషల్ శ్రీలక్ష్మి తదితర అధికారులు పాల్గొన్నారు.

# కోవిడ్ సేవలకు సైన్యం సన్నద్ధతపై మోదీ సమీక్ష

న్యూఢిల్లీ : కోవిడ్–19 విజృంభణ నేపథ్యంలో ప్రజలకు సేవలందించడానికి సైన్యం సన్నద్ధతను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురువారం సమీక్షించారు. ఈ పరిస్థితుల్లో సైన్యం చేపడుతున్న చర్యలను పరిశీలించారు. కోవిడ్ రోగుల సంఖ్య పెరుగుతుండటంతో ఆసుపత్రుల్లో ఆక్సిజన్, పడకల కొరత దేశాన్ని వేధిస్తున్న నేపథ్యంలో భారత సైన్యం చీఫ్‌తో మోదీ సమావేశమయ్యారు. ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంఓ) విడుదల చేసిన ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం, భారత సైన్యం చీఫ్ జనరల్ ఎంఎం నరవనేతో ప్రధాని మోదీ గురువారం సమావేశమయ్యారు. కోవిడ్ మేనేజ్‌మెంట్‌లో సైన్యం చేపడుతున్న సహాయ కార్యక్రమాలపై చర్చించారు. సైన్యంలోని వైద్య సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వాలకు అందుబాటులో ఉంచినట్లు జనరల్ నరవనే తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో తాత్కాలిక ఆసుపత్రులను సైన్యం నిర్మిస్తోందని చెప్పారు. సాధ్యమైన



చోట ప్రజల కోసం ఆసుపత్రులను నిర్మించేందుకు సైన్యం సిద్ధంగా ఉందని చెప్పారు. సమీపంలోని సైనిక ఆసుపత్రులను సందర్శించి, వైద్య సేవలు పొందాలని ప్రజలను కోరారు. దిగుమతి చేసుకున్న ట్యాంకర్ల కోసం అవసరమైన సిబ్బందిని పంపించినట్లు తెలిపారు. వాటిని నిర్వహించేందుకు ప్రత్యేక నైపుణ్యంగలవారిని నియోగిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా దాదాపు ఓ వారం నుంచి రోజుకు మూడు లక్షలకు పైగా కోవిడ్–19 పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ గురువారం ప్రకటించిన వివరాల ప్రకారం, గడచిన 24 గంటల్లో నమోదైన కొత్త కోవిడ్–19 పాజిటివ్ కేసుల సంఖ్య 3,79,257.

# ఇంటర్ పరీక్షలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయండి

### షెడ్యూల్ ప్రకారం మే 5 నుంచి ఇంటర్ పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తు ను దృష్టిలో పెట్టుకొని నిర్ణయం



అమరావతి( విభారె) ఇంటర్ పరీక్షలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాట్లాడారు. విజయవాడలోని సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయం నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల జెసి, ఆర్ఐఓ, డిఈఓ లతో మంత్రి సురేష్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించుకున్నాం. మే 5 నుంచి షెడ్యూల్ ప్రకారం ఇంటర్ పరీక్షలు యధావిధిగా నిర్వహించేందుకు చర్యలు. మొత్తం 1452 కేంద్రాలు ఏర్పాటు.. గత ఏడాదికంటే 41 కేంద్రాలు అదనంగా ఏర్పాటు చేస్తున్నాం. మొదటి ఏడాది విద్యార్థులు 5,12,959 మంది, రెండవ ఏడాది 5,19,510 మంది మొత్తం 10,32,469 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరు అవుతారు. ప్రతి కేంద్రంలో ఒక కోవిడ్ ప్రోటో?కాల్ అధికారి నియామకం, కోవిడ్ లక్షణాలు ఉన్న పిల్లల కోసం ప్రతి కేంద్రంలో ఒక ప్రత్యేక గది ఏర్పాటుచేస్తున్నాం. శుక్రవారం సాయంత్రం లోపు హాల్ టికెట్ లు అప్లోడ్ చేయబడతాయి. హాల్ టికెట్ వెనుక కోవిడ్ నిబంధనలు ముద్రించటం జరిగింది. అన్ని జిల్లాల్లో అధికారులు కోవిడ్ పై జాగ్రత్తలు తీసుకొని పరీక్షలకు సిద్ధం కావాలి. ఇంటర్మీడియట్ పరీక్షలు అనివార్యం అని గుర్తించాలి. ఏ రాష్ట్రంలో కూడా ఇవి రద్దు కాలేదు. కొన్నిచోట్ల నిర్వహిస్తున్నారు. మరికొన్ని చోట్ల వాయిదా వేశారు. కొన్ని రాజకీయ పార్టీలు దీనిని అనవసరంగా రాద్ధాంతం చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రుల మానసిక ధైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాయి. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఇప్పటికే పూర్తి చేసినందుకు అధికారులకు అభినందనలు. 5 నుంచి 23 వరకు జరిగే పరీక్షలు కోవిడ్ జాగ్రత్తలు తీసుకుంటూ దిగ్విజయంగా పూర్తి చేయాలి. వైద్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చూడాలి. అన్ని సెంటర్ లపై నిఘా ఉంచి ప్రతి రోజు నేను కూడా సమీక్షిస్తా. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని సమర్ధవంతంగా అమలు చేసెందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని అన్నారు.


# అవసరం లేదు.. ఐక్యరాజ్య సమితి సాయం నిరాకరించిన భారత్



న్యూఢిల్లీ: కరోనాపై పోరాటంలో భాగంగా ఐక్యరాజ సమితి చేస్తామన్న సాయాన్ని భారత్ నిరాకరించింది. ఈ మహమ్మారిని ఎదుర్కోవడానికి తమ దగ్గరే బలమైన వ్యవస్థ ఉన్నదని భారత్ చెప్పినట్లు యూఎన్ ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ అధికార ప్రతినిధి ఫర్హాన్ హక్ వెల్లడించారు. అవసరమైతే మా ఇంటిగ్రేటెడ్ సరఫరా చెయిన్ ద్వారా సాయం అందిస్తామని భారత్‌కు చెప్పాం. అయితే ప్రస్తుతానికి ఆ అవసరం లేదని, ఇండియాలోనే దీనికి తగిన వ్యవస్థ ఉన్నదన్న సమాధానం వచ్చింది. కానీ ఇప్పటికీ మా ఆఫర్ అలాగే ఉంది. మాకు సాధ్యమైన మేర సాయం చేస్తాం అని ఫర్హాన్ హక్ చెప్పారు.ఏవైనా అత్యవసరాలు యూఎన్ నుంచి ఇండియాకు వస్తున్నాయా అని ప్రశ్నించగా.. ఇప్పటివరకూ వాళ్లు ఏమీ అడగలేదు. కానీ మా వాళ్లు సాయం చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఇండియాతో మేము సంప్రదిస్తూనే ఉన్నామని హక్ తెలిపారు. ఇప్పటికే తీవ్ర ఒత్తిడిలో ఉన్న భారత ఆరోగ్య వ్యవస్థపై మరింత భారం వేయకుండా చూస్తున్నామని చెప్పారు.ఇండియాలో జరుగుతున్న ఎన్నికలు, మత సంబంధమైన ఉత్సవాల కారణంగానే కేసుల సంఖ్య భారీగా పెరిగిపోయిందా అని ప్రశ్నించగా.. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ చూసుకుంటుందని అన్నారు. ప్రతి దేశంలో తీసుకోవాల్సిన చర్యలపై తాము ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూనే ఉన్నామని ఆయన చెప్పారు.

# మాజీ ఎమ్మెల్యే కుడిపూడి చిట్టబ్బాయి కన్నుమూత


### చిట్టబ్బాయి కుటుంబసభ్యులను ఫోన్‌లో పరామర్శించిన సీఎం జగన్



తూర్పుగోదావరి జిల్లా:( విభారె) బీసీ నేత, మాజీ ఎమ్మెల్యే కుడిపూడి చిట్టబ్బాయి కన్నుమూశారు. కాకినాడ ప్రైవేట్ ఆస్పత్రిలో కరోనాతో చికిత్స పొందుతూ గురువారం తుది శ్వాస విడిచారు. చిట్టబ్బాయి కుటుంబసభ్యులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. చిట్టబ్బాయి మృతితో కోనసీమలో తీవ్ర విషాదం అలుముకుంది.కుడిపూడి చిట్టబ్బాయి మృతి పట్ల వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు, అగ్రి మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు చిట్టబ్బాయి మృతి పట్ల సంతాపం ప్రకటించారు.ధర్మాన ప్రసాదరావు సంతాపం..కుడిపూడి చిట్టబ్బాయి మరణం చాలా బాధాకరమని ఎమ్మెల్యే ధర్మాన ప్రసాదరావు అన్నారు. చిట్టబ్బాయి మృతి పట్ల ఆయన సంతాపం వ్యక్తం చేశారు. చిట్టబ్బాయి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ధూళిపాళ్లకు హైకోర్టులో ఎదురుదెబ్బ

### ధూళిపాళ్ల క్వాష్ పిటిషన్‌ను కొట్టేసిన ఏపీ హైకోర్టు నరేంద్రను విచారించాలని హైకోర్టు ఆదేశం






అమరావతి( విభారె) : తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకు ఏపీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ధూళిపాళ్ల క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ఆయనను విచారించాలని కోర్టు ఆదేశించింది. మే 5లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. గుంటూరు జిల్లా వడ్లమూడిలోని సంగం డెయిరీలో పలు అక్రమాలు, అవినీతి కేసులో ధూళిపాళ్ల నరేంద్రను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.. ప్రస్తుతం ఆయన రాజమండ్రి సెంట్రల్ జైల్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. సంగం డెయిరీ అక్రమాల కేసులో ఏ1గా ఉన్న ధూళిపాళ్ల నరేంద్రను ఏసీబీ కస్టడీకి కోరనుంది. సంగం డెయిరీకి ప్రభుత్వం ఇచ్చిన పదెకరాల భూమిని ప్రభుత్వ అనుమతి లేకుండా తన తండ్రి వీరయ్య చౌదరి పేరుతో ఉన్న ట్రస్ట్‌కు నరేంద్ర బదలాయించారు. అప్పటి డెయిరీ ఎండీగా ఉన్న గోపాలకృష్ణ ఆ పదెకరాలను ట్రస్టుకు బదలాయించినట్టు తీర్మానం చేయడం, మేనేజింగ్ ట్రస్టీగా నరేంద్ర వాటిని తీసేసుకోవడం జరిగిపోయాయి. ఇది బైలా నంబర్ 439 ప్రకారం ఉల్లంఘన. ప్రభుత్వ భూమిలో వీరయ్య చౌదరి పేరుతో నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్ నిర్మించుకున్నారు. ఈ ఆస్పత్రికి నరేంద్ర భార్య జ్యోతిర్మయి ఎండీగా వ్యవహరిస్తున్నారు. ఏదైనా సహకార సంఘాన్ని కంపెనీగా మార్చుకోవాలంటే ప్రభుత్వానికి బకాయిలు చెల్లించి, భూములు అప్పగించి జిల్లా కోఆపరేటివ్ అధికారి నుంచి ఎన్‌వోసీ (నిరభ్యంతర పత్రం) తెచ్చుకోవాలి. 2011 ఫిబ్రవరి 28న రిటైర్ అయిన డీసీవో గురునాథం నుంచి ఆయన రిటైర్మెంట్‌కు రెండు రోజుల ముందు తేదీతో ఎన్‌వోసీ తెచ్చి.. సంగం డెయిరీని కంపెనీ చట్టం కిందకు తెచ్చుకున్నారు. ఫలితంగా తన సొంత కంపెనీగా నరేంద్ర డెయిరీని మార్చేశారు. దీనికి సంబంధించి గుంటూరు జిల్లా కోఆపరేటివ్ అధికారి కార్యాలయంలో తనిఖీలు చేసిన ఏసీబీ.. ఎన్‌వోసీకి సంబంధించిన దరఖాస్తు, ఇతర ఉత్తరప్రత్యుత్తరాలు లేవని నిర్ధారించింది. అక్రమ పద్దతుల్లో ఎన్‌వోసీని సృష్టించినట్టు తేలింది. మరోవైపు ఏపీడీడీసీ కమిషనర్ పేరుతో ఉన్న డాక్యుమెంట్లను ఫోర్జరీ చేసి వాటిని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ)లో తనఖా పెట్టి 2013లో ధూళిపాళ్ల నరేంద్ర రూ.115.58 కోట్ల రుణం తీసుకున్నారు.

## నన్ను చంపేసినా సరే.. ప్రశ్నిస్తూనే ఉంటా: దేవినేని ఉమ

విజయవాడ ( విభారె) : మంగళగిరి సీఐడీ కార్యాలయానికి దేవినేని ఉమ హాజరయ్యారు. సీఐడీ కార్యాలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో దేవినేని ఉమ మీడియాతో మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రికి దమ్ము, ధైర్యం ఉంటే విజయవాడ గుంటూరు ప్రభుత్వ హాస్పిటళ్లను సందర్శించాలి. ఈ ప్రభుత్వానికి మానవత్వం లేదు. కరోనాతో ప్రజల ప్రాణాలు పోతుంటే.. జగన్ తాడేపల్లి ప్యాలెస్‌లో ఐపీఎల్ మ్యాచ్‌లు, సినిమాలు చూస్తున్నాడు. 22 సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉన్నాను. నామీద తప్పుడు కేసులు పెట్టి.. నా గొంతు నొక్కలేరు. హైకోర్టు ఆదేశాల్ని గౌరవిస్తూ విచారణకు హాజరయ్యాను. వ్యాక్సినేషన్ ప్రక్రియ అస్తవ్యస్తంగా ఉంది. వ్యాక్సిన్ వేయించలేని పరిస్థితి ఉంది. నన్ను రాజమండ్రి జైలులో పెట్టినా.. చంపినా.. ప్రశ్నిస్తూనే ఉంటాను. పోరాడుతూనే ఉంటాను అని దేవినేని ఉమ పేర్కొన్నారు.



# సంపాదకీయం

శుక్రవారం 30 ఏప్రిల్ 2021

## న్యాయస్థానాలదే కీలకపాత్ర...

రాజకీయాల్లో ఎవరూ ఏమీ చెప్పక్కర్లేదు. లోపాలను ప్రత్యర్థులే పరస్పరం బయటపెట్టుకుంటారు. అధికారపక్షంపై ప్రతిపక్షం, ప్రతిపక్షాలపై అధికారపార్టీ నిరంతరం ఆరోపణలు చేసుకుంటూ ఉ:టాయి. నిజానికి చాలా వరకూ రెండూ నిజమే అయి ఉంటాయి. రోమ్ నగరం తగలబడుతుంటే ఫిడేలు వాయించుకుంటూ కూర్చున్న నీరో చక్రవర్తిని తలపిస్తున్నారు అధికార పార్టీ నాయకులు అంటూ ప్రతిపక్ష నాయకులు చెబుతున్నారు. ఉపద్రవం ఉప్పెనలా చుట్టుముట్టుతుంటే చుట్ట కాల్చుకుందామనుకునే సంకుచిత' నారో' మనస్తత్వంతో ప్రవరిస్తున్నారు ప్రతిపక్ష నాయకులు అంటూ అధికారపార్టీలు విమర్శిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఇదే సాగుతోంది. ఈ కష్ట కాలాన్ని అధిగమించడానికి నా పాత్ర ఏమిటి? నీపాత్ర ఏమిటనే ఆత్మవిమర్శ మాత్రం ఎవరూ చేసుకోవడం లేదు. ప్రధానమంత్రి రిజైన్ చేయాలంటూ సోషల్ మీడియాలో మొదలైన హాష్ ట్యాగ్ ట్రెండింగ్ గా కొనసాగడంపై బీజేపీ కారాలు మిరియాలు నూరుతోంది. ఇందులో ప్రతిపక్షాల కుట్ర ఉందని అక్కసు వెలిగక్కుతోంది. గత ఏడాది కరోనా కట్టడి విషయంలో తనకు లభించిన ప్రతిష్ఠను తాజాగా చేజేతులారా ప్రధాని మంట గలుపుకున్నారు. ప్రజారోగ్యం కంటే రాజకీయ ప్రాధాన్యాలకు పెద్ద పీట వేయడమే ఇందుకు కారణం. దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగానే ఆయన ప్రతిష్ఠకు తీరని దెబ్బ తగిలింది. దీంతో దేశ విదేశాల్లోని మోడీ వ్యతిరేకులంతా సోషల్ మీడియాలో ట్రెండ్ సృష్టిస్తున్నారు.దేశంలో జాతీయంగానూ, రాష్ట్రాల్లోనూ అదికార పార్టీలు చాలా అసహనంగా ఉన్నాయి. ఉద్దేశ పూర్వకం కాకపోవచ్చు కానీ తీవ్రతను గుర్తించడంలో విఫలమయ్యాయి. దానిని అంగీకరించి ప్రజలకు క్షమాపణ చెప్పి , సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేయవచ్చు. విమర్శలకు అతీతంగా తమ పని తాము చేసుకుపోవచ్చు. కానీ అహం అడ్డువస్తోంది. తాము సమర్థులమని, తమ తప్పేం లేదని చెప్పడానికే అధికార పార్టీలు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. ప్రధాని రాష్ట్రాల ముఖ్యమంత్రులు అంతా తప్పు చేశారు . పొరపాటు అంచనాతో కరోనా పట్ల నిర్లక్ష్యం వహించారు. ఇది నిజం. దేశంలో మీడియాను కూడా అధికారపార్టీలకు వ్యతిరేకంగా వార్తలు వేయకుండా నయానో భయానో నియంత్రించారు. కానీ ప్రస్తుతం ప్రపంచ మీడియా వేలెత్తి చూపుతోంది. భారత్ మీడియా ద్వైధీ భావం కూడా ఇందుకు కారణం. దేశీయ మీడియా ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తోంది. కానీ ప్రభుత్వాలు ఏం చేయాలనే విషయమై నిలదీయడంలో సరైన మార్గదర్శకత్వం వహించడం లేదు. ఫలితంగానే ఇండియాలో ఏదో జరిగిపోతోందని అంతర్జాతీయ మాధ్యమాలు హడావిడి మొదలు పెట్టాయి. ఏదేమైనా దేశ ప్రతిష్ఠ బజారున పడింది. మన దేశం నుంచి విమాన యానంపై నిషేధాలు, ఆంక్షలు విధిస్తున్నాయి వివిధ దేశాలు. యూనియన్ ప్రభుత్వమే కాదు, రాష్ట్రాలు సైతం ఈ విషయంలో ఇబ్బందికరమైన పరిస్తితిని చవి చూస్తున్నాయి.ప్రతిపక్షాలు బాధ్యతాయుతమైన పాత్రలో లేవు. ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే నిమ్మగడ్డ రమేశ్ కుమార్ ఉండగానే ఎన్నికలు పెట్టాలని పట్టుబట్టి రాజకీయ సమరం చేసింది తెలుగుదేశం. అప్పటికింకా కరోనా ముప్పు పూర్తిగా తొలగిపోలేదు. ప్రభుత్వం తనకు నచ్చిన కమిషనర్ ను నియమించుకుంటే రాజకీయంగా టీడీపీకి ఏదో అన్యాయం జరిగిపోతుందని ఆ పార్టీ బావించింది. తాజాగా తిరుపతి ఉప ఎన్నికలో అధికారపార్టీకంటే ఎక్కువగా ర్యాలీలు, సమావేశాలతో చంద్రబాబు, లోకేశ్ సహా టీడీపీ అగ్రనాయకులు హడావిడి చేశారు. ఎన్నికల తంతు ముగిసిన వెంటనే కరోనా గుర్తుకు వచ్చింది. పదోతరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు ఆపాలంటూ ఉ ద్యమం చేస్తామంటున్నారు లోకేశ్. అసలు ప్రతిపక్ష అగ్రనాయకులిద్దరూ హైదరాబాద్ కు పరిమితమవుతూ, అక్కడే నివసిస్తూ ఆంధ్రప్రదేశ్ లో ఉద్యమమేమిటని ఎగతాళి చేస్తోంది అధికార వైసీపీ. తెలంగాణలో బీజేపీ, కాంగ్రెసులు కూడా ఖమ్మం, వరంగల్ వంటి చోట్ల తమ ప్రతిష్ఠను కాపాడుకోవడానికి పాకులాడుతున్నాయి. ఎన్నికలనేవి ఆయా పార్టీలకు ప్రజల ప్రాణాల కంటే ప్రతిష్మాత్మకంగా మారడమే విషాదం.ఉన్నత న్యాయస్థానాలకు సకాలంలో జోక్యం చేసుకునే అధికారం ఉంది. కానీ అంతా అయిపోయాక సూక్తులు చెప్పడం విచిత్రంగా కనిపిస్తోంది. ప్రజాస్వామ్య ప్రక్రియ కంటే పౌరుల ప్రాణాలు అత్యంత విలువైనవి. జీవించే హక్కు ప్రాథమిక హక్కుల్లో భాగం. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ఎన్నికల కమిషన్ అడ్డగోలు నిర్ణయాలతో రెచ్చిపోతుంటే అడ్డుకట్ట వేసే అధికారం కోర్టులకు ఉ:టుంది. న్యాయస్థానం జోక్యం చేసుకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమీ చేయలేవు. కానీ పశ్చిమబెంగాల్ హైకోర్టు వ్యాఖ్యలు, తాజాగా తమిళనాడు హైకోర్టు వ్యాఖ్యలు చేతులు కాలిన తర్వాత ఎన్నికల కమిషన్ కు సూక్తులు చెబుతున్న తీరును తలపించాయి. గడచిన ఆరునెలలుగా ప్రభుత్వాలు పూర్తిగా రాజకీయాల వైపు ద్రుష్టి పెట్టాయి. ఎన్నికల కమిషన్ తో పాటు అన్ని వ్యవస్థలూ వేరే గ్రహంలో ఉన్నట్లుగానే ప్రవర్తించాయి. ఫలితంగానే కరోనా విజ్రుంభణ కు దారి తీసింది. న్యాయస్తానాలైనా తమకున్న విశేష రాజ్యాంగాధికారాలతో జోక్యం చేసుకుని ఉంటే పరిస్థితులు చక్కబడి ఉండేవి. ప్రభుత్వాలు తమ తీరును పునరాలోచన చేసుకుని ఉండేవి.

## యాక్టివ్ పాలిటిక్స్ కు కళా దూరం

శ్రీకాకుళం, ఏప్రిల్ 29, (న్యూస్ పల్స్) కళా వెంకటరావు టీడీపీ ఆవిర్భవించినప్పటి నుంచి రాజకీయాల్లో ఉన్న నేత? శ్రీకాకుళం జిల్లాలోని ఉణుకూరు కేంద్రంగా దశాబ్దాల పాటు ఓ వెలుగు వెలిగిన ఆయన రాజాం నియోజకవర్గానికి చెందిన వ్యక్తి. టీడీపీలో వరుస విజయాలు సాధించిన ఆయన పలు కీలక శాఖలకు మంత్రిగా కూడా ఉన్నారు. మధ్యలో ఓ సారి రాజ్యసభకు కూడా ఎంపికయ్యారు. అదే జిల్లాకు చెందిన దివంగత కేంద్ర మంత్రి ఎర్రన్నాయుడుతో ఉన్న విబేధాల నేపథ్యంలో 2009లో ప్రజారాజ్యంలోకి వెళ్లిన కళా వెంకటరావు తిరిగి టీడీపీ గూటికి చేరుకున్నారు. 2014లో ఎమ్మెల్యేగా గెలిచిన ఆయనకు ఆ తర్వాత చంద్రబాబు మంత్రి పదవితో పాటు ఏకంగా ఏపీ టీడీపీ అధ్యక్ష పదవి కట్టబెట్టారు. అటు పార్టీ యువనేత లోకేష్‌తో ఉన్న సాన్నిహిత్యం నేపథ్యంలో కళా వెంకటరావు పార్టీ అధిష్టానం దగ్గర అధికారంలో ఉన్నన్ని రోజులు మంచి పరపతి సాధించుకున్నారు.అటు మంత్రి? ఇటు ఏపీ టీడీపీ అధ్యక్ష హోదాలో ఉన్న కళా వెంకటరావు తన సొంత నియోజకవర్గంలోనే ఘోర పరాజయం పాలయ్యారు. అప్పటి నుంచి అధిష్టానం దగ్గర కళా పరపతి తగ్గిపోతూ వస్తోంది. చంద్రబాబు ఆయన్ను పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పించేయడంతో పాటు ఆయనకు జిల్లాలో రాజకీయ శత్రువుగా ఉన్న మాజీ మంత్రి అచ్చెన్నాయుడుకు ఈ పదవి ఇవ్వడం కళా వెంకటరావుకు ఏ మాత్రం మింగుడుపడడం లేదు. ఇక కళా అసంతృప్తి చెందకుండా ఉండేందుకే ఆయన తమ్ముడు కుమారుడు నాగార్జునకు విజయనగరం పార్లమెంటరీ పార్టీ జిల్లా పగ్గాలు ఇవ్వడంతో పాటు చీపురుపల్లి పార్టీ ఇన్‌చార్జ్ పదవి ఇచ్చారు.ఇటు కళా వెంకటరావు తనయుడు కిమిడి రామ్ మల్లిక్ నాయుడుకు రాష్ట్ర కార్యదర్శిగా స్థానం దక్కింది. ఈ రెండు పదవుల విషయంలో కళా లాబీయింగ్ పనిచేసిందని నిన్న మొన్నటి వరకు పలువురు అనుకున్నా ఇప్పుడు కళా వెంకటరావును అధిష్టానం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని సమాచారం. ఆయన అసమ్మతి రాగం వినిపించినా కుటుంబానికి న్యాయం చేశామని చెప్పేందుకే ఈ రెండు పదవులు ఇచ్చి అధిష్టానం చాలా జాగ్రత్తలు తీసుకుందని అంటున్నారు. ఇప్పటికే కళా వెంకటరావుకు ఎచ్చెర్లలో లోకల్ సెగ ఎక్కువగా ఉంది. ఇప్పుడు ఆయన వారసుడి కన్నా చాలా మంది సీనియర్లు ఉన్నా ? వారిని కాదని వారసుడికి పదవి వ్వడంతో తీవ్రమైన అసమ్మతి రగులుతోంది.ఇటు కళా వెంకటరావు తమ్ముడు తనయుడు నాగార్జునకు ఏకంగా పార్లమెంటరీ పార్టీ పగ్గాలు ఇవ్వడం కూడా విజయనగరం జిల్లా నేతలకు నచ్చడం లేదు. అటు కళాకు వ్యతిరేకంగా విజయనగరం జిల్లా నేతలతో పాటు అచ్చెన్న కూడా ఒక్కటి అవుతోన్న పరిణామాలు స్థానికంగా కనిపిస్తున్నాయి. విచిత్రం ఏంటంటే కళా వెంకటరావును కాదని ఎచ్చెర్లలో స్థానిక నేతలు నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. చివరకు కళా తమకు వ్యతిరేకంగా ఎవరైనా పనిచేస్తే వారి అంతు చూస్తానని.. వచ్చే ఎన్నికల్లో తనకే సీటు వస్తుందని చెపుతున్నా కూడా ఎవ్వరూ లెక్కచేయడం లేదు.ఇక మరోవైపు కళా వెంకటరావు మరో సోదరుడు రామకృష్ణ నాయుడు బీజేపీలోకి వెళ్లే ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఆయన ఈ విషయాన్ని ఓపెన్‌గా చెప్పేయడంతో కళాకు మరో షాక్ అని చెప్పక తప్పదు. వచ్చే ఎన్నికల నాటికి ఎచ్చెర్ల నుంచి కళా వెంకటరావును పూర్తిగా తప్పించే ప్రయత్నాలు అయితే గట్టిగానే జరుగుతున్నాయి. ఇస్తే గిస్తే ఆ ఫ్యామిలీకి అది కూడా చీపురుపల్లి సీటు తప్పా మరో సీటు ఇచ్చే ప్రసక్తే లేదని పార్టీ వర్గాల్లోనే స్థానికంగా చర్చ నడుస్తోంది. ఇటీవల చంద్రబాబు, లోకేష్ ఇద్దరూ కనీసం జిల్లా పార్టీ వ్యవహారాల విషయంలో కూడా కళా వెంకటరావుతో చర్చించడం లేదని అంటున్నారు. ఏదేమైనా టీడీపీలో నాలుగు దశాబ్దాల కళాత్మక ఇన్సింగ్స్ ముగిసినట్టే సిగ్నల్స్ వస్తున్నాయి.

## సంగం సాక్ష్యాలిచ్చినందుకు కీలక పదవి

గుంటూరు, ఏప్రిల్ 29, (న్యూస్ పల్స్)సంగం డెయిరీ లో అవకతవకలున్నాయని, అందులో లోగుట్టును అంతా బయటపెట్టింది ఎవరో తెలుసా? అక్కడ వైసీపీ నేత రావి వెంకట రమణ. ఆయన ధూళిపాళ్ల నరేంద్ర పై అనేక ఏళ్లుగా పోరాటం చేస్తూనే ఉన్నారు. కానీ అక్కడ జరిగే అవకతవకలను ఎవరి దృష్టికి తీసుకెళ్లినా పెద్దగా ఫలితం కన్పించలేదు. దీంతో రావి వెంకటరమణ సంగం డెయిరీకి సంబంధించి పకడ్బందీగా ఆధారాలను సేకరించి జగన్ ముందుంచారంటున్నారు. దీనివల్లనే ధూళిపాళ్ల నరేంద్రను అరెస్ట్ చేయగలిగారంటున్నారు.రావి వెంకటరమణ వైసీపీలో నమ్మకమైన నేత. గత ఎన్నికల్లోనే రావి వెంకటరమణ పొన్నూరు నియోజకవర్గం నుంచి పోటీ చేయాల్సి ఉంది. అయితే కొన్ని ఈక్వేషన్ల కారణంగా జగన్ కిలారు రోశయ్యకు టిక్కెట్ ఇచ్చారు. తనను కాదని కిలారు రోశయ్యకు టిక్కెట్ ఇచ్చినా రావి వెంకటరమణ చిత్తశుద్ధితో ఆయన గెలుపుకోసం పనిచేశారు. ధూళిపాళ్ల నరేంద్ర ను ఓడించడమే ధ్యేయంగా పెట్టుకుని విజయం సాధించారు.రావి వెంకటరమణ సీనియర్ నేత 2004లోనే ఆయన ప్రత్తిపాడు నుంచి పోటీ చేసి మాకినేని పెద్దరత్తయ్యను ఓడించారు. అలాంటి వెంకటరమణ వైసీపీ అధికారంలోకి వచ్చినా ధూళిపాళ్ల నరేంద్ర సంగం డెయిరీలో అక్రమాలను కొనసాగిస్తున్నారని భావించి గత కొద్ది నెలలుగా దీనిపై నిఘా వేశారంటున్నారు. నేరుగా జగన్ తోనే డెయిరీ వ్యవహారం మాట్లాడేందుకు వీలుకలిగింది. దీంతో రావి వెంకటరమణ పూర్తి స్థాయి ఆధారాలు సేకరించి జగన్ ముందుంచడతో ఏసీబీ అధికారులు ధూళిపాళ్ల నరేంద్రను అరెస్ట్ చేశారు.

జగన్ కూడా రావి వెంకటరమణను ప్రశంసించినట్లు చెబుతున్నారు.ఇక్కడ వైసీపీ ఎమ్మెల్యేగా కిలారు రోశయ్య ఉన్నప్పటికీ ఆయన నిన్నటి వరకూ ధూళిపాళ్ల నరేంద్ర పై నోరు మెదపలేదు. ఇద్దరూ ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోకూడదన్న ఒప్పందం ఉన్నట్లుంది. ఇది గమనించిన జగన్ రావి వెంకటరమణకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చి గో ఎహెడ్ అని చెప్పడంతో ఆయన సక్సెస్ ఫుల్ గా టాస్క్ ను పూర్తి చేశారంటున్నారు. 1200 కోట్ల టర్నోవర్ ఉన్న సంగం డెయిరీలో జరుగుతున్న అక్రమాలను సాక్షాధారాలతో సమర్పించడంతో జగన్ త్వరలోనే రావి వెంకటరమణ కు కీలక పదవి ఇవ్వబోతున్నట్లు వైసీపీలో ప్రచారం జరుగుతోంది.

## తిరుపతితో సీన్ మారుతుందా

తిరుపతి, ఏప్రిల్ 29, (న్యూస్ పల్స్)తిరుపతి లోక్ సభ ఉప ఎన్నిక ఫలితాల మీద అందరి చూపూ ఉంది. చంద్రబాబు గురించి ఒక్క మాటలో చెప్పాలంటే అక్కడ చమడోడ్చారు అనే అనాలి. ఈ వయసులో కరోనా సెకండ్ వేవ్ గట్టిగా ఉన్నా కూడా కసిగా చంద్రబాబు తిరుపతిలో కలియతిరిగారు. ఒక ఉప ఎన్నిక కోసం ఇంత విపరీతంగా ప్రచారం చేసిన అధినాయకుడు బాబు తప్ప ఎవరూ ఉండరన్నది మాత్రం నిజం. ఆయనతో పోలిస్తే వయసులో చిన్నవాడు అయిన పవన్ ఒక మీటింగుతో సరిపెడితే జగన్ అసలు ప్రచారానికే పోలేదు. దీన్ని బట్టి చంద్రబాబు రాజకీయ ఆకాంక్షల తీవ్రత ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవాల్సిందే.చంద్రబాబు తిరుపతి ఎన్నికల కోసం బాగా కష్టపడ్డారు. ఒక వ్యూహం ప్రకారం దూసుకుపోయారు. పార్టీని మొత్తం తిరుపతికి షిఫ్ట్ చేశారు. తాను సైతం రాత్రీ పగలు తేడా లేకుండా తిరుపతిని చుట్టేశారు. జనాలకు వైసీపీ మీద మోజు ఉండవచ్చు, సంక్షేమ పథకాలు వారిని అటు వైపుగా లాగేయవచ్చు కానీ చంద్రబాబు ఈ వయసులో పడిన కష్టానికి ఆయన తాపత్రయానికి ఏ మాత్రం టర్న్ అయినా చంద్రబాబు చిందించిన చమట చుక్కలకు భారీ ఫలితం దక్కినట్లే. బాబు కోరుకుంటున్నది నెరవేరితే మళ్లీ ఆయన బలంగా పుంజుకున్నట్లే.తిరుపతిలో చంద్రబాబు గెలిచేస్తాను అని బరిలోకి దిగలేదు. గత ఎన్నికల్లో టీడీపీకి అయిదు లక్షల ఓట్లు వచ్చాయి. ఇపుడు వాటిని వీలు అయితే మరో లక్ష పెంచుకోవాలి అది తొలి టార్గెట్. ఇక వైసీపీకి వచ్చిన రెండు లక్షల పై చిలుకు మెజారిటీ నుంచి లక్ష ఓట్లు అయినా కత్తెర వేయాలి. మరో వైపు మూడవ ఆల్టరేషన్ అంటూ దూసుకొచ్చిన బీజేపీ జనసేన కనీసంగా పుంజుకోకుండా ఎక్కడికక్కడ కట్టడి చేయాలి. ఇదే చంద్రబాబు పట్టుదల. దానికోసమే ఆయన గట్టిగా పనిచేశారు. పార్టీని కూడా పరుగులు పెట్టించారు.చంద్రబాబు అనుకుంటున్నట్లుగా తిరుపతి ఉప ఎన్నికల్లో వైసీపీ మెజారిటీ

బాగా తగ్గితే మాత్రం అది టీడీపీ నైతిక విజయమే అవుతుంది. చంద్రబాబు గట్టిగా ఊపిరి పీల్చుకోవడమే కాదు, మళ్ళీ గాలి పోయిన సైకిల్ కి పంక్చర్ వేసి మరీ పరుగులు పెట్టిస్తారు. అదే సమయంలో తన అయిదు లక్షల ఓట్ల కంటే అదనంగా మరిన్ని ఓట్లు తెచ్చుకుంటే ఇక చంద్రబాబుని పట్టడం కష్టమే అవుతుంది అంటున్నారు. బీజేపీ ఈ ఎన్నికల్లో లక్ష ఓట్ల పై చిలుకు తెచ్చుకోవాలని ఆశపడుతోంది. కానీ ఏ యాభై వేల వద్దనో ఆ పార్టీ కూలబడితే ఇక బాబు గాలిలోనే తేలుతారు అంటున్నారు. అపుడు బీజేపీ ఆశలన్నీ గల్లంతు కావడమే కాదు ఏపీ రాజకీయాల్లో మరోమారు పొత్తుకు చంద్రబాబునే ఆశ్రయించాల్సి ఉ ంటుంది. మొత్తానికి తిరుపతి ఉప ఎన్నికల్లో ఇదే జరగాలని టీడీపీ గట్టిగా కోరుకుంటోంది. ఆ విధంగానే మాస్టర్ ప్లాన్ వేసుకుని మరీ బాబు బరిలోకి దిగారు. తిరుపతి ఫలితాలు ఏపీలో రాజకీయాన్నే మారుస్తాయా లేదా అన్నది చూడాలి.

## ప్రభుత్వం పరీక్షలను రద్దు చేయాలి

**టీడీపీకర్నూలు పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి రంగస్వామినాయుడు**

గోనెగండ్ల పరీక్షల పేరుతో విద్యార్థులు,ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడటం సిగ్గుచేటని వెంటనే పరీక్షలను రద్దు చేయాలని కర్నూలు పార్లమెంటు తెలుగు యువత అధికార ప్రతినిధి రంగస్వామినాయుడు,వార్డు మెంబర్లు పూజరీ రంగస్వామి, జిలానీ బాషా,టిఎన్ఎస్ఎఫ్ మండల నాయకులు పూజరీ లక్ష్మీ కాంత్,రాంపురం రఫిక్ లు అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎమ్మిగనూరు మాజీ శాసనసభ్యులు డా?? బివి.జయనాగేశ్వ రెడ్డి ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ఇంటర్,పది పరీక్షలను రద్దు చేసే అంశంలో ప్రభుత్వం మితిమీరి వ్యవహరిస్తోందని విమర్శించారు.ప్రభుత్వ అధిపతి అయినా ముఖ్యమంత్రి గారు కూడా 10వ తరగతి పరీక్షలు నిర్వహించే తీరుతామని చెప్పడం విద్యార్థులను కరోనకు బలిచేయడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వాపోయారు.ప్రభుత్వం నిర్వహించే ఇంటర్,పదో తరగతి పరీక్షలకు సుమారు 16.3లక్షల మంది హాజరు కావాల్సి ఉంటుందని అన్నారు.కరోనా రెండో దశ తీవ్రతలో పరీక్షల నిర్వహణ విద్యార్థులకు ప్రాణసంకటంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.దేశంలోని దాదాపు 20రాష్ట్రాలు,10,12వ తరగతి విద్యార్థులకు పరీక్షలు వాయిదా వేయటం లేదా రద్దు చేశాయన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇందుకు విరుద్ధంగా ఏపీలో పరీక్షలు నిర్వహించాలనుకోవటం ముమ్మాటికీ కరోనా వైరస్ ను మరింత వ్యాప్తి చేయటమే అవుతుందని,లక్షలాది మందికి సురక్షితమైన వాతావరణం కల్పించటం అసాధ్యమని అన్నారు.ఏ ఒక్క విద్యార్థి కరోనా బారిన పడితే అది క్షమించరాని నేరం అవుతుందని దానికి ముఖ్యమంత్రినే బాధ్యుడని పేర్కొన్నారు.కేంద్రం కూడా సీబీఎస్ సిలబస్ గురుకుల,నవోదయ 10వ తరగతి పరీక్షలను రద్దు చేసినా విషయాన్ని గుర్తుచేసుకోవలన్నారు.విద్యార్థులకు సిలబస్ పూర్తి కాకుండానే ప్రభుత్వం పరీక్షలకు వెళ్తామనడం,ఫెయిల్ అయినా విద్యార్థులు నుండీ ఫీజుల పేరుతో దోచుకునేందుకే ఈ ప్రణాళికలు వేసినట్టు అనుమానం కలుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరచి విద్యార్థులు,ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు,తల్లిదండ్రులు వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని 10వ తరగతి పరీక్షలను రద్దు చేసి ఇంటర్ పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో హోటల్ వలిబాష,నాయక్ షాషావలి,బేతల మహబూబ్ బాషా,పూజరీ ప్రసాద్,పూజరీ వంశీ,గోపాల్,నాగరాజు,అహోబిలం,చిన్నా తదితరులు పాల్గొన్నారు.

## యువతలో క్రీడా నైపుణ్యాన్ని మెరుగు పరిచేలా కృషి చేయాలి

పెద్దపల్లి గోదావరిఖని ప్రాంతానికి చెందిన ఫైటింగ్ చాంప్స్ కిక్ బాక్సింగ్ క్లబ్ నిర్వాహకులు రాదండి రాజకుమార్, కంకటి కుమార్ లను పెద్దపెల్లి జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు నియమించడం జరిగింది. గోదావరిఖనికి చెందిన క్రీడాకారుల ఎంపిక కావడం పట్ల యువజన స్వచ్ఛంద సంఘాల పక్షాన గురువారం రాజకుమార్, కుమారులను అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ యువజన అవార్డు గ్రహీత ఈదునూరి శంకర్ అభినందిస్తూ యువతలో క్రీడా నైపుణ్యాన్ని మెరుగు పరిచేలా క్రీడల పట్ల ఆసక్తి కలిగేలా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ తమవంతు కృషిని అందించాలని, క్రీడల్లో యువత జాతీయ స్థాయిలో రాణించాలని అన్నారు.

## తాడిపత్రిలో పెద్దారెడ్డి హర్ట్...

అనంతపురం, ఏప్రిల్ 29, (న్యూస్ పల్స్)అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గంలో దాదాపు 40 ఏళ్ల రాజకీయం నడిపిన జేసీ బ్రదర్స్‌కు షాకిస్తూ .. గత ఎన్నికల్లో వైసీపీ తరఫున కేతిరెడ్డి పెద్దారెడ్డి విజయం దక్కించుకున్నారు. తన హవా కావొచ్చు.. పార్టీ దూకుడు కావొచ్చు. మొత్తానికి ఈ నియోజకవర్గంలో వైసీపీ పాగా అయితే వేసింది. దీంతో ఇంకేముంది.. జేసీ వర్గం పని అయిపోయిందని వైసీపీ నాయకుడు, ఎమ్మెల్యే పెద్దారెడ్డి భావించారు. తొలి యేడాది జేసీ ఫ్యామిలీ సైలెంట్‌గా ఉండడంతో పెద్దారెడ్డి హడావిడి మామూలుగా లేదు. ఇక ఆ తర్వాత పెద్దారెడ్డి ఆధిపత్య రాజకీయాలకు తెరదీశారు. నేరుగా జేసీ ప్రభాకర్ రెడ్డి ఇంటికి వెళ్లి మరీ.. హెచ్చరించి వచ్చారు. దీంతో ఇంకేముంది.. తాడిపత్రిలో జేసీ వర్గం పని అయిపోయిందనే అనుకున్నారు అందరూ.అనూహ్యంగా.. ఇటీవల జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో తాడిపత్రిలో జేసీ ప్రభాకర్ రెడ్డి విజయం సాధించి కౌన్సిల్ పీఠాన్ని దక్కించుకున్నారు. ఏపీలో జరిగిన కార్పోరేషన్, మునిసిపల్ ఎన్నికల్లో టీడీపీ గెలిచిన ఏకైక మున్సిపాల్టీ తాడిపత్రి ఒక్కటే. ఈ పరిణామం.. సహజంగానే ఎమ్మెల్యే పెద్దారెడ్డిపై ప్రభావం చూపింది. ఆయన దూకుడు రాజకీయం వల్లే.. సేవ్ తాడిపత్రి నినాదంతో జేసీ వర్గం దూసుకుపోయి.. సింపతీ పాలిటిక్స్ గెలిపించాయని.. పెద్దారెడ్డి సైలెంట్ గా ఉంటే.. వైసీపీనే విజయం దక్కించుకుని ఉండేదని.. వైసీపీలోనే నాయకులు గుసగుసలాడుతున్నారు.ఇక, పరిషత్ ఎన్నికల్లో పెద్దారెడ్డిని పక్కన పెట్టిన అనంతపురం ఎంపీ.. తలారి రంగయ్య.. తనే అన్నీ అయి చక్రం తిప్పారు. ఇది.. పెద్దారెడ్డి పెద్దరికానికే పెద్ద ఇబ్బందిగా మారిపోయింది. పోనీ.. సాహసం చేసి.. ఎంపీని ఎదిరించాలని అనుకుంటే.. తాడిపత్రి ఓటమి.. ఆయనను కలవరపెడుతోందని.. అనుచరులు చెబుతున్నారు. పోనీ సైలెంట్‌గా ఉంటే.. ప్రత్యర్థుల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఒక్క ప్రత్యర్థుల నుంచే కాకుండా.. సొంత పార్టీలోని సీనియర్లు కూడా పెద్దారెడ్డిపై విమర్శలు చేస్తున్నారు.ఈ పరిణామాలతో హర్ట్ అయిన.. పెద్దారెడ్డి.. పార్టీకి దూరంగా ఉంటున్నారు. నియోజకవర్గంలోనూ గతంలో ఉన్నంత యాక్టివ్‌గా కనిపించడం లేదని టాక్ నడుస్తోంది. మరి వచ్చే ఎన్నికల నాటికి ఆయనకు టికెట్ దక్కుతుందా ? అనేది కూడా ప్రశ్నార్థకంగా మారిందని అంటున్నారు పరిశీలకులు. ఒకే ఒక్క ఓటమి పెద్దారెడ్డి జీవితాన్ని పూర్తిగా తల్లకిందులు చేసిన పరిస్థితే ఉంది.

## బైరెడ్డి, గౌరు ఫ్యామిలీలదే హవా

కర్నూలు, ఏప్రిల్ 29, (న్యూస్ పల్స్)కర్నూలు రాజకీయాల్లో బైరెడ్డి, గౌరు ఫ్యామిలీలదే హవా. ఈ రెండు కుటుంబాలు తాతల కాలం నుంచి జిల్లా రాజకీయాలను శాసిస్తున్నాయి. కాగా కాలక్రమేణా.. బైరెడ్డి ఫ్యామిలీలో విభేదాలు రావడంతో రాజశేఖర్ రెడ్డి, అతడి తమ్ముడి కొడుకు సిద్ధార్థరెడ్డి చెరో పార్టీలో కొనసాగుతున్నారు. మొన్న జరిగిన ఎన్నికల్లో వైసీపీ తరఫున సిద్ధార్థరెడ్డి, బీజేపీ తరఫున రాజశేఖర్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయకపోయినా.. తమ సన్నిహితులకు టిక్కెట్లు ఇప్పించుకుని ప్రచారం నిర్వహించారు.అయితే అటు గౌరు ఫ్యామిలీ కూడా కర్నూలు రాజకీయాల్లో యాక్టివ్ గానే ఉంది. పాణ్యం నుంచి గౌరు చరితా రెడ్డి పోటీ చేసి వైసీపీ అభ్యర్థి కాటసాని రామ్ భూపాల్ రెడ్డి చేతిలో ఓడిపోయారు. ఇటు నంది కొట్కూరులోనూ తమ అనుచరిడిని నిలబెట్టినా..వైసీపీ తరఫున సిద్ధార్థరెడ్డి తన అభ్యర్థి ఆర్థర్ ను గెలిపించుకున్నారు. ఈ ఓటమితో యువ నాయకుడు సిద్ధార్థరెడ్డి, గౌరు వెంకట్ రెడ్డికి ఉన్న విభేదాలు తారా స్థాయికి పెరిగాయి. ఇక బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, గౌరు వెంకట్ రెడ్డిలు అనూహ్యంగా ఎన్నికల సందర్భంగా కలిసి పోవడం ఒక సంచలనమే అని చెప్పాలి. ఇదిలా ఉంటే.. నంది కొట్కూరులో సిద్ధార్థ అనుచరులకు, గౌరు వెంకట్ రెడ్డి అనుచరులకు నిత్యం గొడవలు జరుగుతూనే ఉన్నాయి. ఆధిపత్య పోరులో ఇరువురి మనుషులు కూడ చనిపోయారు. మొన్నటి వరకు జరిగిన మున్సిపల్, పరిషత్, సర్పంచ్ ఎన్నికల్లోనూ ఇది స్పష్టంగా కనిపించింది. ఇప్పటికే చాలా గొడవలు జరిగాయి వీరిద్దరి మధ్య.ఇప్పుడు మరోసారి వీరి అనుచరుల మధ్య గొడవలు చోటుచేసుకున్నాయి. నందికొట్కూరు మండలం కోళ్లబాపురంలో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య మరోసారి ఘర్షణ జరిగింది. ఇందులో టీడీపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. అంతేకాదు పోలీసులకు కూడా దెబ్బలు తాకాయి. ఓ కానిస్టేబుల్ అపస్మారక స్థితిలోకి కూడా వెళ్లారు. దీంతో మరోసారి నందికొట్కూరు రాజకీయాలు భగ్గుమన్నాయి. ఇక దీనిపై సిద్ధార్థ రెడ్డి, గౌరు వెంకట్ రెడ్డి ఎలా స్పందిస్తారనేది చూడాలి.

## కోర్టు వైపు.. పార్టీల చూపు

తిరుపతి, ఏప్రిల్ 29, (న్యూస్ పల్స్)తిరుపతి బైపోల్ ఎన్నికలను అన్ని పార్టీలూ సీరియస్ గా తీసుకున్నాయి. బీజేపీ సత్తా, జనసేన బలం, టీడీపీ పరువు, వైసీపీ ప్రతిష్ట అన్న మాదిరిగా ఎన్నికలు జరిగాయి. ఎలాగైనా గెలిచి ప్రజల్లో మళ్లీ స్థానం సంపాదించాలని బీజేపీ, జనసేన ఆరాటపడ్డాయి. అలాగే టీడీపీ కూడా గత అన్ని ఎన్నికల్లో ఓడిపోయినా.. ఈ సారి గెలిస్తే తమ పరువు దక్కుతుందని భావించింది. ఇక వరుస ఎన్నికల్లో గెలిచి జోరు మీదున్న వైసీపీ.. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి.. ప్రతిపక్షాలు లేవని తేల్చి చెప్పాలనుకుంది.ఈ క్రమంలో అన్ని పార్టీలు జోరుగా ప్రచారం నిర్వహించాయి. కరోనాను సైతం లెక్క చేయకుండా ఇంటింటి ప్రచారాలు నిర్వహించాయి. కాకపోతే ఇక్కడ కొన్ని ట్విస్టులు జరిగాయి. ప్రతిపక్షాల్లోని అధినేతలందరూ ప్రచారం చేసినా.. జగన్ మాత్రం చివరి నిముషంలో వెనక్కు తగ్గారు. కొవిడ్ కారణంగా సభ పెట్టట్లేదంటూ ప్రకటన చేశారు. దీంతో వైసీపీకి ఓటమి భయం పట్టుకుందని అన్ని పార్టీలు మొత్తుకున్నాయి. అయితే చివరికి పోలింగ్ రోజు మాత్రం పెద్ద రగడే జరిగిందని చెప్పాలి. అధికార పార్టీ వాళ్లు బస్సుల్లో దొంగ ఓట్లు వేసేవారిని తీసుకొచ్చి ఓటేయించారంటూ ఆరోపించాయి ప్రతిపక్షాలు. మంత్రులు, ఎమ్మెల్యేలు కోడ్ ను ఉల్లంఘించి.. పోలింగ్ రోజు కూడా తిరుపతిలోనే ఉన్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశాయి.అలాగే అధికారులు, వార్డు వలంటీర్లు ఓటర్లను బెదిరించారని బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి రత్నప్రభ ఆరోపించారు. అక్కడితో ఆగకుండా ఎన్నికల ఫలితాలు ఆపేయాలని, రీ పోలింగ్ జరపాలంటూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వీరిక తోడు టీడీపీ అభ్యర్థి పనబాక లక్ష్మి కూడా పోలింగ్ పై విచారణ జరపాలంటూ పిటిషన్ దాఖలు చేసింది. ఫలితాలను ప్రకటించకుండా.. ఎన్నికల సంఘంకు నోటీసులు ఇవ్వాలంటూ కోరింది. దీంతో ఈ రెండు పిటిషన్లను కలిపి విచారిస్తోంది కోర్టు. అయితే దీనిపై స్పష్టమైన ఆదేశాలేవీ కోర్టు ఇప్పటి వరకు ఇవ్వలేదు. దీనికి ఇంకా టైమ్ ఉండటంతో మళ్లీ వాయిదా వేసే అవకాశాలే ఉన్నాయి.

## దూరమవుతున్న విష్ణుకుమార్ రాజు

విశాఖపట్టణం, ఏప్రిల్ 29, (న్యూస్ పల్స్)బీజేపీలో చాలా మంది నాయకులు.. రాజకీయాల్లోనే ఉన్నప్పటికీ.. ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. అంటే.. ఎన్నికల వేళ పోటీకి దూరంగా ఉంటున్నారు. తాము రాజకీయాల్లోనే ఉంటామని.. సలహాలు, సూచనలు పార్టీకి అందిస్తామని.. కానీ.. ప్రజాక్షేత్రంలో మాత్రం పోటీ చేయమని గతంలోనే కామినేని శ్రీనివాస్, కంభంపాటి హరిబాబు.. వంటివారు చెప్పేశారు. దీంతో పోటీ చేసే వారి కోసం.. 2019 ఎన్నికల్లో బీజేపీ ఎదురు చూడాల్సిన పరిస్థితి వచ్చింది. కొన్ని నియోజకవర్గాల్లో పెద్దగా ప్రజాబలం లేని నాయకులకు సైతం టికెట్‌లు ఇవ్వాల్సి వచ్చింది.వాస్తవానికి ఎంత రాజకీయ నేత అయినా.. ప్రజా బలం ఉంటే.. పోటీ చేయడం రాజకీయాల్లో రివాజు. పైగా ఇతర పార్టీల్లో ఎలాంటి ప్రజా బలం లేని నాయకులు కూడా.. పోటీ చేస్తామని..ముందుకు వస్తున్నారు. కానీ, బీజేపీలో అంతో ఇంతో ప్రజాబలం ఉన్న నాయకులు రాజకీయాలు చేస్తాం కానీ, పోటీ మాత్రం చేయమని చెబుతున్నారు. దీనికి కారణాలు ఏంటి? అనే విషయంపై పార్టీ ఇప్పటి వరకు దృష్టి పెట్టకపోవడం గమనార్హం. దీనిపై అంతర్గతంగా కూడా చర్చించలేదు. పోయే వారు పోయినా.. కొత్తవారికి అవకాశం ఇస్తా మనే ఆలోచనో.. లేక మరేమిటో తెలియదు కానీ.. బీజేపీలో ఒక విధమైన పరిస్థితి మాత్రం కనిపిస్తోంది.సరే! ఇప్పుడు కూడా ఇలాంటి పరిస్థితి బీజేపీకి ఎదురైంది. విశాఖ ఉత్తర నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే పెన్మత్స విష్ణుకుమార్ రాజు.. పార్టీలో తనదైన గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రతిపక్షాలపై విమర్శ లు చేయడంలోను.. ప్రస్తుతం అధికార పక్షంలో ఉన్న వైసీపీని ఇబ్బంది పెట్టడంలోను.. విమర్శలు చేయడంలోను ఆయన ముందున్నారు. నాడు ఆయన అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యేగా ఉన్నా చంద్రబాబు, జగన్ ఇద్దరితోనూ సత్సంబంధాలు పెట్టుకుని లౌక్యమైన రాజకీయ నేతగా పేరు తెచ్చుకున్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన ఆయన ఆ తర్వాత సైలెంట్ అయ్యారు.పార్టీలోనూ ఎందుకో గాని ఆయనకు పెద్దగా గుర్తింపు లేకుండా పోయింది. ఈ పరిణామాల నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నట్టు వెలుగు చూసింది. ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లోను, కార్పొరేషన్ ఎన్ని కల్లోనూ బీజేపీ ఎక్కడా సత్తా చాటలేక పోయింది. ఈ క్రమంలో విశాఖలోనూ పార్టీ చతికిల పడింది. ముఖ్యంగా ఉత్తర నియోజకవర్గంలోని ఒక్క డివిజన్ లో కూడా బీజేపీ గెలవలేదు.. సరికదా విష్ణు ప్రభావం ఏ మాత్రం లేదు. దీనిపై అంతర్గతం గా జరిగిన చర్చలో విష్ణు ఒకింత వైరాగ్యం ప్రదర్శించారు. వచ్చే ఎన్నికల్లో నేను పోటీ చేయకుండా ఉంటే బెటర్ ! అని ఆయన వ్యాఖ్యానించినట్టు పార్టీలో చర్చ జరుగుతోంది. అయితే.. దీనిని ఆయన బహిరంగంగా ప్రకటించకపోయినా.. ప్రస్తుతం జరుగుతున్న తిరుపతి ఉప ఎన్నికల తర్వాత.. ప్రకటించడం ఖాయమని తెలుస్తోంది. దీనికి కారణం ఏంటి? ఎందుకు ? ఇలా యూటర్న్ తీసుకున్నారు? అనే అంశాలు ఆసక్తిగా మారాయి. మరి ఏం చేస్తారో చూడాలి.

## అనధికార ఆసుపత్రిలపై దాడులు

తాడేపల్లిగూడెం పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూ డెం, తణుకు పట్టణాల్లోని కరోనా బాధితులకు అనధికార వైద్యం చేస్తున్న ఆసుపత్రులపై విజిలెన్సు అధికారులు దాడు లు చేశారు. తణుకులో జేకే హాస్పటల్ వైద్యుడు శివకుమార్ కృష్ణా రెసిడెన్సీ లాడ్జిలో ఐదుగురికి వైద్యం అందిస్తున్నట్టు గుర్తించి వారిని అంబులెన్సులో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జేకే ఆసుపత్రి ఐసీయూలో పేషెంట్లు ఉండటం వల్ల 24 గంటలు సమయం ఇచ్చామని, లాడ్జిని సీజ్ చేసినట్టు విజిలెన్సు సీఐ విల్సన్ తెలిపారు. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలో ఓ విద్యా సంస్థను ఇటీవలే తాత్కాలిక ఆసుపత్రి అనుమతితో ప్రారంభించారు. ఆ ఆసుపత్రిలో ఎలాంటి అనుమతులు లేకుండా కరోనా సోకిన వారిని రూ.45 వేల వరకూ కట్టించుకుని వైద్యం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారు లకు ఫిర్యాదులు వెళ్లడంతో సొమ్ములు కట్టించుకున్న బాధితులను బయటకు వెళ్లిపోవాలని చెప్పడంతో వారు వేరే దిక్కులేక తణుకు ప్రభుత్వ ఆసుపత్రి లో చేరినట్టు సమాచారం. విచారణ చేసి ఆసుపత్రిలో కరోనా బాధితులకు వైద్యం అందిస్తున్నట్టు నిర్ధారించామని ఉన్నతాధికారులకు తెలిపి ఆసుపత్రిని సీజ్ చేసినట్టు తహసీల్దార్ అప్పారావు తెలిపారు.

## సోమిరెడ్డి ఆశీర్వాదం తీసుకున్న తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దినేష్ రెడ్డి

నెల్లూరు తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలంరెడ్డి దినేష్రెడ్డి గురువారం టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆశీర్వాదం తీసుకున్నారు.తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా నియమింపబడిన సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆశీర్వాదం కోసం హైదరాబాద్ లోని ఆయన స్వగృహంలో కలిసి యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూతెలుగుదేశం పార్టీ ఎంతో మంది ప్రజా నాయకులని తయారు చేసిన కర్మాగారం లాంటిది అని పార్టీ ఇచ్చిన బాధ్యత ని నిర్వర్తిస్తూ పార్టీ కి యువతలో మంచి దృక్పథం ఏర్పాటు చేయాలని ,అందుకు మీలాంటి యువత ముందుకు నడవాలని, మీకు సీనియర్ నాయకుల ప్రోత్సాహం ఎపుడు ఉంటుంది అని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా దినేష్ రెడ్డి మాట్లాడుతూపార్టీ ఇచ్చిన బాధ్యతను క్రమశిక్షణ తో పాటిస్తానని జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు , యువనాయకులు లోకేష్ అడుగుజాడల్లో పనిచేస్తానని దినేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో దినేష్ వెంట ఏరియా కోఆర్డినేటర్ చెముకుల కృష్ణ చైతన్య తదితరులు ఉన్నారు.

## వీర జవానుకు ఘనంగా అంతిమ వీడ్కోలు

కోసిగి కోసిగి మండల పరిధిలోని పల్లిపాడు గ్రామానికి చెందిన చిన్నగౌడ్,లక్ష్మి దంపతుల కుమారుడైన దేవరింటి. రామాంజనేయులు (30) దేశం కోసం పనిచేయాలనే తపనతో భారతసైన్యంలోని అమోఈ పని చేస్తూ,బుధవారం మరణించారు.గురువారం స్వగ్రామమైన పల్లిపాడులో దహనసంస్కారాలు జరిగాయి. ఈసందర్భంగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి,మండల ఇంచార్జ్ మురళీరెడ్డి ప్రగాఢ సానుభూతి ని తెలిపారు.తన ఎనమిది సంవత్సరాల సర్వీసులో ఎక్కడ రిమార్కు లేకుండా పనిచేయుచూ,డిల్లీలోని గజేబాగ్ నందు 28వతేదిన తెల్లవారుజామున అనారోగ్యం తో మరణించడం జరిగిందన్నారు.వీరజవాను మృతదేహాన్ని గురువారం ఉదయం పల్లిపాడు గ్రామంలో ప్రభుత్వ లాంచనాలతో యస్ఐ ధనుంజయ్ ఖననం చేయడం జరిగింది.స్థానిక ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి, ప్రభుత్వం నుండి ఏవిధమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి,మండల ఇంచార్జ్ మురళీరెడ్డి రామాంజనేయుల కుటుంబంకు మనోధైర్యాన్ని అందించాలని,ఎల్లప్పుడూ ఆ కుటుంబంకు అందుబాటులో ఉంటామని తెలిపారు.

# కామ్ గా మారిపోయిన కమ్మ సామాజికవర్గం

విజయవాడ, ఏప్రిల్ 29, (న్యూస్ పల్స్)ఏపీ రాజకీయాల్లో కమ్మ సామాజిక వర్గం పాత్ర చాలానే ఉంది. ఆ మాటకు వస్తే తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం ముందు నుంచే అనేక రంగాల్లో ముందున్న ఈ వర్గం ఆ తర్వాత రాజకీయంగా కూడా తెలుగు నేలపై అన్ని ప్రాంతాలకు విస్తరించింది. పైగా విదేశాల్లో స్థిరపడిన కమ్మ సామాజిక వర్గం ఏపీలో పెట్టుబడులు పెట్టడంలోను, ఇక్కడి రాజకీయాలను శాసించడంలోను కూడా ముందుంది. చంద్రబాబు హయాంలో రాజధాని అమరావతికి జైకొట్టిన ఎన్నారైలు.. ఇక్కడ పెట్టుబడులు కూడా పెట్టారు. అదే సమయంలో అమరావతి ఉద్యమం నేపథ్యంలో వారు సైతం.. ప్రధాన పాత్ర పోషించారు. రాజధానిగా అమరావతే ఉండాలంటూ.. వారు కోరుకున్నారు. ఇక్కడి రైతులకు సైతం అండగా ఉన్నారు.ఇక, ఆరేడు మాసాలుగా పూర్తిగా కమ్మ సామాజిక వర్గం సైలెంట్ అయింది. ముఖ్యంగా ఎన్నారై లుగా ఉన్న కమ్మ వర్గం ఇప్పుడు ఎక్కడా ఏపీ గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. దీనికి కారణం ఏంటి? ఎందుకు? అంటే.. తాము కనుక వేలు పెడితే.. జగన్ ప్రభుత్వం మరింతగా కమ్మలపై దాడి చేస్తుందని.. వారిని రాజకీయంగా కూడా ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తుందని.. సో.. ఇప్పుడు సైలెంట్ అయిపోయి.. వచ్చే ఎన్నికల నాటికి దూకుడుగా ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. అదే సమయంలో చంద్రబాబు హయాం మళ్లీ వస్తేనే తప్ప.. రాష్ట్రం అభివృద్ధి అయ్యే పరిస్థితి లేదనే విషయాన్ని బలంగా తీసుకువెళ్లాలంటే.. ఇప్పుడు కొన్నాళ్లు సైలెంట్ అవ్వాల్సిన అసవరం ఉందని వారు భావిస్తున్నట్టు సమాచారం.గతంలో చంద్రబాబు పాలనను తీసుకుంటే.. ఏపీలోకానీ, ఉమ్మడి రాష్ట్రంలో కానీ.. ఎన్నారై లకు చెందిన కమ్మ వర్గం వారి పెట్టుబడులు, వ్యాపారాలు ఎక్కువ. రాష్ట్ర అభివృద్ధిలో వారిదే కీలక పాత్ర అనే విధంగా ఉంది. కానీ, ఇప్పుడు వారు పట్టించుకోవడం లేదు. ఎక్కడా పెట్టుబడులు పెట్టడం లేదు. పైగా.. స్వచ్ఛంద సేవలు కూడా చేయడం లేదు. ఇలా దూరంగా ఉండడం వల్ల.. రాష్ట్రం అన్ని రంగాల్లోనూ వెనుకబడడం ఖాయమని.. తద్వారా. ఎన్నికల నాటికి దీనిని చూపించేందుకు అవకాశం ఉంటుందని కమ్మ సామాజికవర్గం భావిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.ఇక, ఎన్నికల సమయానికి.. మళ్లీ.. 2014లో అనుసరించిన సోషల్ మీడియా ప్రచార వ్యూహాన్ని అమలు చేయడం ద్వారా.. తిరిగి చంద్రబాబును గద్దెనెక్కించేందుకు అవకాశం ఉంటుందని కమ్మలు భావిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న ఉత్తర అమెరికా తెలుగు సంఘం ఎన్నికల్లోనూ టీడీపీ అనుబంధ ఎన్నారై సంఘాలు కూడా ఇదే ఫార్ములాను పాటిస్తున్నాయి. చంద్రబాబు అనుకూల వర్గాలు .. వచ్చే ఎన్నికల నాటికి ఏపీలో బాబును తిరిగి అధికారంలోకి తీసుకువచ్చేందుకు వ్యూహం సిద్ధం చేసుకున్నట్టు ప్రచారం సాగుతుండడం గమనార్హం. ఈ క్రమంలోనే ఎన్నారైలు.. దూరంగా ఉన్నారని.. ప్రచారం జరుగుతుండడం గమనార్హం. ఇక్కడ మరో చిత్రమైన విషయం ఏంటంటే.. చంద్రబాబు ఎప్పుడూ.. ఎన్నారైల గురించి మాట్లాడేవారు.కానీ, ఇప్పుడు వారి గురించి ఆయన కూడా సైలెంట్‌గా ఉన్నారు. దీనిని బట్టి.. ఈ సైలెంట్ వెనుక వ్యూహం ఉందని అంటున్నారు పరిశీలకులు.

# కోవిడ్ నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం

**మధురపూడి విమానాశ్రయాన్ని ఆకస్మికంగా పరిశీలించిన ఎంపి భరత్ రామ్**

**భారీ విమానాలకు అనువుగా రన్ వే..**

రాజమహేంద్రవరం..కరోనా నివారణకు అన్ని చర్యలు చేపడుతున్నామని రాజమహేంద్రవరం ఎంపి, ఎయిర్ పోర్ట్ అడ్వయిజరీ కమిటీ ఛైర్మెన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ చీఫ్ విప్ మార్గాని భరత్ రామ్ తెలిపారు. రాజమహేంద్రవరం నగర సమీపంలో గల మధురపూడి విమానాశ్రయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి, అక్కడ కోవిడ్ నిబంధనలు అమలు తీరును నిశితంగా పరిశీలించారు. ఎయిర్ పోర్టు అధికారులతో చర్చించారు. ఇతర రాష్ట్రాల నుంచి రాజమహేంద్రవరం వచ్చే విమాన ప్రయాణికుల ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నదీ లేనిది అడిగి తెలుసుకున్నారు. అలాగే వారి వెంట తెచ్చుకునే లగేజీని సైతం ఫిగ్మెంట్ చేసి మరీ పంపిస్తున్నట్లు ఎంపి అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఎయిర్ పోర్టు డైరెక్టర్ మనోజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపి భరత్ రామ్ మీడియా తో మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి, అలాగే విదేశాల నుంచి ఎక్కువగా వస్తారు కాబట్టి కరోనా వ్యాప్తికి ఎక్కువ అవకాశాలు ఉండవచ్చుననే అభిప్రాయంతో విమానాశ్రయాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఇక్కడ వారి పరిధి మేరకు కరోనా నివారణ చర్యలు తీసుకుంటున్నారని, అయితే మరిన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎయిర్ పోర్టు నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల ఆరోగ్యాన్ని పరీక్షించే నిమిత్తం సోడియం హైపో క్లోరైడ్ టన్నల్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళనున్నట్లు ఎంపి తెలిపారు. మరో ముఖ్య విషయం జిల్లాలో ఆక్సిజన్ నిల్వల కొరత ఏర్పడితే తక్షణ రవాణాకు మధురపూడి ఎయిర్ పోర్టు లో ఐఎల్-76 ఫ్లైటు అందుబాటులో ఉందని తెలిపారు. ఆక్సిజన్ సరఫరాకు వినియోగించే భారీ విమానాలు ల్యాండ్ అయ్యేందుకు మధురపూడి విమానాశ్రయం రన్ వే అనుకూలంగా ఉందని ఎయిర్ పోర్ట్ అధికారులు తనకు తెలియజేశారని ఎంపి భరత్ రామ్ తెలిపారు. ఎయిర్ పోర్టు నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల నిమిత్తం ఏర్పాటు చేసిన థర్మల్ స్క్రీనింగ్ ను ఎంపి భరత్ పరీక్షించారు. అలాగే టెంపరేచర్ను ఎంపి భరత్ స్వయంగా పరీక్షించుకున్నారు. విమానాశ్రయంలో విధులు నిర్వహించే వారందరికీ కోవిడ్ వ్యాక్సినేషన్స్ వేయించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు.

# వాలంటీర్ వ్యవస్థ దేశంలోనే ఆదర్శం

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎం. హరి జవహర్ లాల్**

సాలూరు,ఏప్రిల్ 29 కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా ప్రజలలో మమేకమై నిరంతరం ప్రభుత్వ అభివృధి, సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నది వాలంటీర్లు అని జిల్లా కలెక్టర్ కొనియాడారు. సాలూరు నియోజక వర్గంలో సాలూరు అర్బన్, సాలూరు,మక్కువ,పాచి పెంట, మెంటాడ మండలాలకు సంబంధించి సాలూరు కౌన్సిల్ హాల్లో గురువారం గ్రామ, వార్డు వాలంటీర్లకు సత్కార సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎం. హరి జవహర్ లాల్ పాల్గొన్నారు. నియోజక వర్గంలో ఉన్న ఐదుగురు వాలంటీర్లకు సేవా వజ్ర, 25 మంది వాలంటీర్లకు సేవా రత్న, 1243 మంది వాలెంటిర్లకు సేవా మిత్ర పురస్కారాలతో, ప్రశంసా పత్రం, బ్యాడ్జి దుషాలువాలతో సత్కరించారు. సేవా వజ్రకు రూ.30 వేలు, సేవరత్నకు రూ.20 వేలు, సేవా మిత్రకి 10వేలు చొప్పున నగదు పురస్కారాన్ని అందజేశారు కార్యక్రమానికి ముందుగా ముఖ్య అతిథి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎం.హరి జవహర్ లాల్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సాలూరు శాసన సభ్యులు రాజన్నదొర వారి అధ్యక్షతన జరగవలసి యున్నది కానీ వారికి ఆరోగ్యము బాగులేనందున వారు హాజరు కాలేకపోయారు అని వారు త్వరగా కోలుకోవాలని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల పై ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా వారికి ప్రభుత్వ పథకాలు చేరువ అవుతాయని. అందు నిమిత్తం ప్రజలకు అవగాహన కల్పించే భాధ్యత ప్రతి వలేంటిర్ దే అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలులో రాష్ట్రంలోనే విజయనగరం జిల్లా మొదటి స్థానం లో ఉందన్నారు. ఇందుకు వలెంటిర్లే కారణమన్నారు. ప్రస్తుతం కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలంతా మాస్క్ లు ధరించి, సామాజిక దూరం పాటిస్తూ, చేతులు పలు మార్లు శుభ్రపరచుకొనెలా ప్రజలలో అవగాహన కల్పించే భాధ్యత వలేంటీర్లదే అన్నారు. కార్యక్రమంలో వలెంటిర్లు తమ అనుభవాలను, అభిప్రాయాలను తెలిపారు. కార్యక్రమంలో ఐ.టి.డి.ఎ ప్రాజెక్ట్ అధికారి ఆర్.కూర్మనాథ్, జిల్లా పరిషత్ సి.ఇ.ఓ టి.వెంకటేశ్వర రావు, సాలూరు మున్సిపల్ చైర్ పర్సన్ ఈశ్వరమ్మ, వైస్ చైర్ పర్సన్ జడ్జ్ఆప్ దీప్తి మండలాల తహసీల్దార్లు, ఎం.పి.డి.ఓ లు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు,వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# కరోనా ఫ్రంట్ వారియర్స్ కు ప్రత్యేకంగా వార్డులు కేటాయింపు

**కలెక్టర్ చక్రధర్ బాబు**

నెల్లూరు జిల్లా వైద్య శాఖ ఉద్యోగ సంఘాలతో వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. కరోనా అత్యవసర వైద్య సేవలు, కరోనా సంబంధిత టెస్టు, కరోనా వ్యాక్సిన్ కార్యక్రమాలు నిర్వహిస్తూ 2 రోజుల క్రితం కరోనా బారిన పడి మరణించిన సంగం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏ ఎన్ ఎం శశి కుమారి మరియు కరోనా బారిన పడుతున్న డాక్టర్లు వైద్య సిబ్బంది, ఆశ వాలంటీర్ల ఆరోగ్య పరిస్థితిని జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే,, వారు వెంటనే స్పందించి వార్డు కేటాయిస్తామని చెప్పడం సంతోషదాయకం వైద్య శాఖ ఉద్యోగులు అన్నారు. ఈ క్లిష్టపరిస్థితుల్లో కలెక్టర్ హామీ చాలా సంతోషంగా ఉందని, ఫ్రంట్లైన్ వారియర్స్ ను కాపాడుకోవడం ద్వారా, అనేకమంది కోవిద్ బారినపడిన వ్యాధిగ్రస్తులను కాపాడేందుకు అవకాశం ఏర్పడుతుందని, అదేవిధంగా జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి ఆరోగ్యశాఖ సిబ్బందికి కరోనా సంబంధిత అత్యవసర పరిస్థితి ఎదురైనప్పుడు వాట్సాప్ మెసేజ్ ద్వారా తెలియజేయడం గాని ,కరోనా వ్యాధిగ్రస్తులు తీవ్రత ఎక్కువగా ఉన్నట్లయితే ఫోన్ ద్వారా తెలియజేసినా స్పందించడం జరుగుతుందని చెప్పడం శుభ పరిణామమం. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చక్రధర బాబుకి ,జిల్లా జాయింట్ కలెక్టర్ డెవలప్మెంట్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డికి, వైద్య ఆరోగ్య శాఖ డాక్టర్లు వైద్య సిబ్బంది పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయడమైనది. జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు మంచిగా కరోనా కోవిద్ అడ్మినిస్ట్రేషన్ చేయడం తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి సమస్య చెప్పిన వెంటనే స్పందించడం చాలా సంతోషంగా ఉంది అని, వైద్యశాఖ ఉద్యోగులందరూ రెట్టింపు ఉత్సాహంతో సేవలందిస్తామని హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్ రావు , అసోసియేట్ ప్రెసిడెంట్ డాక్టర్ అమరేంద్రనాథ్ రెడ్డి, జిల్లా సెక్రెటరీ డాక్టర్ కమల్ కిరణ్ ఈ సందర్భంగా తెలియజేశారు..ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు డాక్టర్ ఖాదర్ బాషా, డాక్టర్ మొయిన్, ఐఎన్టీయూసీ నాయకులు షఫీ వుల్లా , హంస జిల్లా ట్రెజరర్ శేషగిరిరావు, జిల్లా వైస్ ప్రెసిడెంట్లు శ్రీనివాసులు, జలీల్ అహ్మద్, ఉద్యోగ సంఘం నాయకులు సురేష్, ఉదయ్ కిరణ్, సురేష్, గోపి ,రవి తదితరులు పాల్గొన్నారు

## అత్యాచారయత్నానికి పాల్పడిన లాయర్ రాజా రాముకు వెంటనే అరెస్ట్ చేయాలి

**యానాదుల గిరిజన సంక్షేమ సంఘం**

నెల్లూరు గిరిజన మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడిన లాయర్ రాజా రామ్ ను వెంటనే అరెస్టు చేయాలని యానాదుల(గిరిజన)సంక్షేమ సంఘం గురువారం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా వారు కోవూరు పట్టణంలోని పాటూరుకు పోయే రోడ్డులోని సిరి అపార్ట్మెంట్ లో వాచ్ మెన్ గా పని చేస్తున్న గిరిజన మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడిన లాయర్ రాజా రామ్ ను చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడవలసిందిగా విజ్ఞప్తి చేశారు. గురువారం సంక్షేమ సంఘం బృందం బాధిత మహిళను, కుటుంబ సభ్యులను పరామర్శించి, వివరాలు అడిగి తెలుసుకుని, వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిందితుడిపై కోవూరు పోలీస్టేషన్ లో అట్రాసిటీ కేసు నమోదైందని, వెంటనే నిందితుడ్ని అరెస్టు చేసి, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యానాదుల(గిరిజన) సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసి పెంచలయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఇండ్ల రవి, యువజన నాయకులు ఎల్లంపల్లి రమేష్, లాయర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిరాడంబరంగా ఫరిద్ బాబా ఊరుసు మహోత్సవం

**కోవిడ్ నిబంధనల నడుమ ఏకాంతంగా సాగిన ఉత్సవాలు**

**ముఖ్య అతిథిగా పేర్ని నాని.. స్వాగతం పలికిన ఉత్సవ కమిటీ**

మచిలీపట్నం కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఫరిద్ బాబా మస్తాన్ ఆలియా 54వ ఊరుసు మహోత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. కమిటీ పెద్దలు అప్పారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్ర మం జరిగింది.కోవిడ్ కారణంగా భక్తులు తాకిడి తక్కువగానే ఉన్నప్ప టికీ కమిటీ సభ్యులు కొద్దిమంది ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఊరుసు మహోత్సవం, గుందోత్సవం వంటి కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గురువారం తెల్లవారు జామున బాబా వారి శుద్ధి స్నానంలో , గంధం మహోత్సవంలో అనంతరం జరిగిన పూజ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర మంత్రి వర్యులు పేర్నినాని పాల్గొన్నారు. ప్రతి ఏడాది రెండు రాష్ట్రాల నుండి సుమారుగా 30 నుండి 40 వేల భక్తులు పాల్గొనే ఈ ఉరుసు కార్యక్రమం గత రెండేళ్ల నుండి కరోనా కారణంగా భక్తులను ఆహ్వానించకుండా కమిటీ సభ్యులతోనే నిర్వహిస్తున్నారు. ఊరుసు మహోత్సవం ప్రారంభం సందర్భంగా దర్గా కమిటీ సెక్రటరీ శొంఠి ఫరీద్ మాట్లాడుతూ కరోనా విస్తరిస్తిన్న నేపథ్యంలో ప్రభుత్వ నిబంధనలు అనుసరించి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల నుంచి వేళా సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమానికి హాజరు అయ్యేవారని తెలిపారు. సుమారు 30వేళా మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించే వారమని అన్నారు. భక్తులను ఎవరిని కోవిడ్ కారణంగా ఆహ్వానించలేదని, భక్తుల తరపున అప్పారావు ప్రార్ధనలు నిర్వహిస్తారని వెల్లడించారు. కరోనా ఈ ఏడాదితో పోవాలని బాబావారిని ప్రార్దించినట్లు ఫరిద్ పేర్కొన్నారు.

## విద్యార్ధులవి ప్రాణాలు కావా



విశాఖపట్నం తన ప్రాణాలు కాపాడుకోవడానికి ప్యాలెస్ దాటి బయటకురాని ముఖ్యమంత్రి, విద్యార్థుల ప్రాణాలను పట్టించుకోకుండా మూర్ఖంగా పరీక్షలు రాయాల్సిందేనంటున్నాడని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు విమర్శించారు. పది, ఇంటర్ పరీక్షల విషయంలో ముఖ్యమంత్రి మూర్ఖత్వంతో కాకుండా మానవత్వంతో ఆలోచించాలి. కరోనా వస్తుందన్న భయంతో అసెంబ్లీని, తిరుపతి ఉపఎన్నిక ప్రచారాన్ని జగన్మోహన్ రెడ్డి రద్దు చేసుకున్నాడు. తనవి మాత్రమే ప్రాణాలు, విద్యార్ధులవి ప్రాణాలు కావన్నట్లు మూర్ఖత్వంతో వ్యవహరించడమేంటి? ముఖ్యమంత్రి మూర్ఖత్వంగా వ్యవహరిస్తుంటే సీనియర్ మంత్రులు అర్థమయ్యేలా చెప్పాలికదా? ఉపాధ్యాయులు కరోనాతో చనిపోతున్నా, ముఖ్యమంత్రి మూర్ఖపు నిర్ణయంపై ఉపాధ్యాయసంఘాలు స్పందించకపోవడమేంటి? విద్యార్థులు, వారితల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కరోనా బారినపడి ప్రాణాలు కోల్పోతే, ముఖ్యమంత్రి రోడ్డుపై నిలబడాల్సి వస్తుంది. కాబట్టి, పరీక్షల నిర్వహణ విషయంలో ముఖ్యమంత్రి మంచితనంతో ఆలోచన చేయాలి. రాష్ట్రంలో కరోనా విలయతాండవానికి, ప్రజలంతా ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని భయంతో బతకడానికి మూర్ఖుడైన మన ముఖ్యమంత్రే కారణమని అయ్యన్నపాత్రుడు మండిపడ్డారు.

## దర్శి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గా హరిప్రసాద్ రావు

దర్శి ప్రకాశం జిల్లా దర్శి లో గురువారం నూతన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎపిసీపిడిసిసి) గా బి. హరిప్రసాద్ రావు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ రావు మాట్లాడు తూ తాను ఇప్పటి వరకు ఇంకొల్లు లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గా పనిచేస్తూ పదోన్నతి పై దర్శి లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గా రావడం జరిగింది అని తెలిపారు. తదుపరి మాట్లాడుతూ వినియోగదారులకు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా సంప్రదించ వచ్చని తెలిపారు. వినియోగ దారులకు నిరంతరాయంగా విద్యుత్ అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వినియోగ దారులు తమ సర్వీస్ ల యొక్క బకాయిలు వెంటనే చెల్లించి సంస్థ కు సహకరించగలరు అని కోరారు. ఈ కార్యక్రమం లో ఎ ఈ తదితరులు పాల్గొన్నారు.

## డీకేలో కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్ ఓ దినేష్ కుమార్

నెల్లూరు తిరుపతి లోక్ సభ ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ మే నెల 2 వ తేదీన జరిగే తిరుపతి పార్లమెంటు ఎన్నికల కౌంటింగ్ కేంద్రం డి.కె. మహిళా కళాశాలను గురువారం పరిశీలించారు. కౌంటింగ్ సందర్భంగా పాటించాల్సిన విధులు, కోవిడ్ వ్యాప్తి నివారణా చర్యలపై అధికారులకు సూచనలు జారీచేశారు. కౌంటింగ్ కేంద్రం మొత్తం బ్లీచింగ్ తో పాటు శానిటైజేషన్ ప్రక్రియ చేపట్టాలని, ఎన్నికల కౌంటింగ్ సిబ్బంది కచ్చితంగా కోవిడ్ నిబంధనలు పాటించేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి.ఎం.హెచ్.ఓ స్వర్ణలత ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఎం. హెచ్.ఓ తదితరులు పాల్గొన్నారు.

## విధులు బహిష్కరించిన కాంట్రాక్ట్ ఆరోగ్య సేవకులు

పెద్దపల్లి రామగుండం ఏరియా 1 గోదావరిఖని సింగరేణి ఏరియా హాస్పటల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఆరోగ్య సేవకులు గురువారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. టిఆర్ఎస్ పార్టీ అనుబంధ తెలంగాణ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఆరోగ్య సేవకులు వారికి రావాల్సిన హక్కులు రావాలనీ, కోవిడ్ బారినపడ్డ వారికి సేవలు చేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు, వార్డు బాయ్, ఆయాలకు మొదటి దశ కోవీడ్ లో ఉద్యమం చేసి సాధించుకున్న రూ.50 లక్షల ఇన్సూరెన్స్, 7 రోజులు చేస్తే మూడు రోజులు మాస్టర్ తో కూడిన సెలవులు, స్పెషల్ ఇన్సెంటివ్ కరోనా పేషెంట్లకు సేవలు చేస్తుండగా కోవిడ్ సోకిన కార్మికులకు వైద్య సేవలకు పూర్తి వేతన ఇస్తామని యజమాన్యం ఒప్పుకోవడం జరిగింది. కానీ ఆ మాటను గాలికి వదిలేసి ఏడుగురు కాంట్రాక్టు సిబ్బందికి ఇంతవరకు ఆ వేతనం కట్టించలేదన్నారు. అంతే కాకుండా పూర్తిస్థాయిలో ఇన్సెంటివ్ కూడా నామ్ కే వాస్తే కే ఇస్తున్నారు తప్ప పూర్తిగా ఇవ్వడం లేదు సెకండ్ వేవ్ కోవిడ్ సింగరేణి కార్మికులు వారి కుటుంబాలు అధికంగా చేరుతున్నారన్నారు.

# పది, ఇంటర్ పరీక్షలు వాయిదా వెయ్యాలి

**పిడిఎస్ యు జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్ర బాబు**

ఎమ్మిగనూరు పది, ఇంటర్ పరీక్షలు వాయిదా వేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీ.డీ.ఎస్.యూ) జిల్లా ఉపాధ్యక్షులు మహేంద్ర బాబు డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక ఎమ్మిగనూరు పట్టణంలో సోమప్ప సర్కిల్ నందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూప్రపంచవ్యాప్తంగా కరోనా మహమ్మారి విజృంభిస్తున్న తరుణంలో మరి తమిళనాడు, ఢిల్లీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం లో అసెంబ్లీలో తీర్మానం ప్రవేశ పెట్టి ఆక్కడ ఉన్నటువంటి పదవ తరగతి ఇంటర్ పరీక్షలను వాయిదా చేయడం జరిగింది. మరి ఇక్కడ ఉన్నటువంటి వైయస్సార్ ప్రభుత్వం, మంత్రి ఆదిమూలపు సురేష్ గారు మరి విద్యార్థి ప్రాణాలను దృష్టిలో పెట్టుకోకుండా మరి కార్పొరేటర్ ర్యాంకుల కోసం సూట్కేసులో కోసం మరి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడే విధంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం పై ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రోజురోజుకు కొన్ని వేల కేసులు నమోదవుతున్నాయి మరి ఇలాంటి తరుణంలో విద్యార్థులకు పరీక్షల పెట్టడం పద్ధతి కాదని మరి ఇకనైనా విద్యార్థులకు వెంటనే పరీక్షలు రద్దు, వాయిదా చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య

విద్యార్థి సంఘం డిమాండ్ చేస్తున్నాం. అదేవిధంగా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పరీక్షలు నిర్వహిస్తే విద్యార్థులకు కరోనా సోకినా రాష్ట్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని అన్నారు. ఈ కార్యక్రమం లో పి డి ఎస్ యు నాయకులు ఆషిఫ్, రామకృష్ణ నాయుడు, సమీర్, నరసింహ రెడ్డి, శ్రీను, బుడ్డన్న, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక చట్టాల కుదింపుకు వ్యతిరేకంగా పోరాడుదాం

ఆదోని ( విభారె) మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలలో కార్మిక చట్టాలను కుదించడం ప్రజలందరూ వ్యతిరేకించాలని,కార్మిక హక్కుల సాధనకై ఉద్యమించాలని అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఏ ఐ ఎఫ్ టి యు)రాష్ట్ర అధ్యక్షులు కరీంబాష పిలుపునిచ్చారు.గురువారం స్థానిక భీమస్ హోటల్ నందు అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా మహాసభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఏ ఐ ఎఫ్ టి యు రాష్ట్ర అధ్యక్షులు కరీంబాష,ఆంధ్రప్రదేశ్ రైతుకూలి సంఘం నాయకులు నరసింహయ్య,ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు సుజ్ఞానమ్మ, రాయలసీమ కో ఆర్డినేషన్ కమిటీ(ఆర్ సి సి)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు,రాష్ట్ర నాయకులు రామలింగయ్య లు మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తూ అన్ని వర్గాల ప్రజలను రోడ్డున పడవేసిందని అన్నారు.కార్మికులు పోరాడి సాధించుకున్న 42 చట్టాలను మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా 4 చట్టాలుగా కుదించి కార్మికుల హక్కులను కాలరాసిందని అన్నారు.మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ ప్రజలకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. కర్నూలు జిల్లాలో మూతబడిన పరిశ్రమలను నూతనంగా పునరుద్ధరణ చేయాలని కోరారు. నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.కోవిడ్ తో మరణించిన కార్మికులకు జాతీయ విపత్తు సహాయ నిధి నిబంధనల ప్రకారం బాధిత కార్మిక కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై అన్ని కార్మికులతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు .అనంతరం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఏ ఐ ఎఫ్ టీయూ జిల్లా అధ్యక్షులుగా బాలయ్య,జిల్లా ప్రధాన కార్యదర్శిగా గంగన్న, ఉపాధ్యక్షులుగా లక్ష్మయ్య,నాగరాజు,సహాయ కార్యదర్శిగా సుబ్బయ్య, సుబ్బారెడ్డి తో పాటు మరో 11 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ సి సి రాష్ట్ర నాయకులు నాగరాజు,రామంజినేయులు, సీమ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ రామరాజు,నాయకులు రవి,అనిల్ ,ఈరన్న పాల్గొన్నారు.

## పోలీసులకు చుక్కలు చూపించిన దొంగ

కర్నూలు, ఏప్రిల్ 29,( విభారె) కర్నూలు జిల్లాలో గోల్డ్ రికవరీ కోసం వచ్చిన పోలీసులకు షాకిచ్చాడో దొంగ. సీన్ రివర్స్ కావడంతో కథ మొదటికి వచ్చింది. ఆత్మకూరు మండలం సిద్ధాపురంకు చెందిన ఓ దొంగను తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా పెబ్బేరు పోలీసులు చోరీ కేసులో అరెస్టు చేశారు. అక్కడ దొంగతనం చేసిన బంగారం గురించి ఆరా తీయంగా.. విచారణలోకర్నూలు జిల్లా ఆత్మకూరులో బంగారం వ్యాపారికి అమ్మినట్లు చెప్పాడు. బుధవారం అతడ్ని తీసుకుని ఆత్మకూరు స్థానిక షరాఫ్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడ్ని పెబ్బేరు పోలీసులు సంప్రదించారు.బంగారం వ్యాపారులు మొత్తం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు.. దొంగ చెప్పిన వివరాలు తెలుసుకున్నారు. గోల్డ్‌ను ఇంతియాజ్ అనే వ్యాపారికి అమ్మేశానని దొంగ చెప్పగా.. షరాఫ్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు రషీద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మకూరులో అలాంటి బంగారం ఎవరూ కొనుగోలు చేయరని.. ఎవరికి విక్రయించావో సరిగ్గా చెప్పాలని దొంగను గట్టిగా ప్రశ్నించారు. అప్పుడు దొంగ చెప్పిన సమాధానంతో అందరికి దిమ్మ తిరిగింది. పోలీసులే తనను ఒప్పించి ఏదో ఒక షాపు పేరు చెప్పాలని ఒత్తిడి చేశారనడంతో అందరూ అవాక్కయ్యారు. బంగారం ఆత్మకూరులో అమ్మేసినట్లు ఆధారాలు ఉంటే కేసు నమోదు చేయాలని.. కోర్టుకు హాజరవుతామని రషీద్ సూచించటంతో పెబ్బేరు పోలీసులు వెళ్లిపోయారు

## పరీక్షల రద్దు కోసం పాల్ దీక్ష

విశాఖపట్టణం, ఏప్రిల్ 29, ( విభారె) )ఏపీలో టెన్త్, ఇంటర్ విద్యార్థుల కోసం ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడుకేఏ పాల్ పోరాటం చేస్తున్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ పాల్ నిరసన దీక్షకు దిగారు. సీఎం జగన్ పరీక్షలు రద్దు చేస్తానని చెప్పే వరకూ దీక్ష కొనసాగిస్తానని ఆయన తెలిపారు. 35 లక్షల మంది విద్యార్థులకు న్యాయం జరిగే వరకు దీక్ష కొనసాగిస్తాను అన్నారు. టెన్త్, ఇంటర్ పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీక్ష మాత్రమే కాదు.. టెన్త్, ఇంటర్ పరీక్షలు వాయిదా వేయాలని ఆయన ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.కరోనా కేసులు పెరుగుతున్న సమయంలో ఏపీలో టెన్త్, ఇంటర్ పరీక్షలు నిర్వహించడం దారుణమన్నారు. కరోనా సోకితే విద్యార్థుల ప్రాణాలకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. పొరుగు రాష్ట్రాల్లో పరీక్షలు వాయిదా వేశారని.. ప్రభుత్వం ఎందుకు పంతానికి పోతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఇటువంటి పరిస్థితిలో పిల్లలను పరీక్షలకు పంపుతారా.. మంత్రులు పంపుతారా అని ప్రశ్నించారు. 'మీ పిల్లలవే ప్రాణాలా?' అంటూ మండిపడ్డారు. పరీక్షలపై ఏపీ హైకోర్టు నిర్ణయం తీసుకోకుంటే విద్యార్థులు కరోనాకు బలైపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి జగన్ విద్యార్థుల భవిష్యత్, ప్రాణాలు గురించి ఆలోచించాలని కోరారు. రాష్ట్రంలో కావాల్సింది పొలిటికల్ ఫైటింగ్ కాదు.. ప్రజలు, విద్యార్థుల ప్రాణాలు ముఖ్యమన్నారు.

# టూత్ పేస్టుతో మీరు ఈ ట్రిక్కులను ఉపయోగించి మీ ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోండి !



ప్రతీ మహిళ తన ఇంటిని ఒక దేవాలయంగా భావిస్తుంది, అలా ఆమె తన ఇంటిలోని ప్రతీమూలను పరిశుభ్రంగా ఉంచుకునే పనిలో ఆమె ఎల్లప్పుడూ నిమగ్నమై ఉంటుంది.మీ ఇంటి చుట్టూ ఉన్న మరకలు మిమ్మల్ని మరింతగా ఇబ్బందిపెడుతున్నాయా ? గోడమీద చాక్పీస్తో రాసిన మరకలు, మీకు ఇష్టమైన తెల్లని టీషర్టు పై ఉన్న లిప్స్టిక్ మరకలు, మీ అందమైన సెంటర్ టేబుల్ మీద ఉన్న కాఫీ మరకలు (లేదా) కెట్చప్ మరకలు వంటి ఇతరములు మీకు రాత్రిళ్లు నిద్రలేకుండా చేస్తాయి.మీ ఇంటిని మరకలు లేకుండా, పరిశుభ్రంగా ఉంచేందుకు మిమ్మల్ని అనిత్యము వెంటాడే సమస్యల గురించి మాకు పూర్తిగా తెలుసు. మీ ఇంటిని పరిశుభ్రం చేయడంలో మీకు సహాయపడే సులభమైన విధానాల గురించి మేము ఇక్కడ మీకు తెలియ చేయబోతున్నాము.మీ ఇల్లు అపరిశుభ్రంగా ఉండటానికి కారణమైన మరకలను తొలగించడానికి, టూత్పేస్ట్ అనే ఒకే ఒక్క ఆయుధంతో తిరిగి




మీ ఇంటిని పరిశుభ్రపరుచుకోవచ్చు. టూత్పేస్ట్ అనేది ప్రతి ఇంట్లోనూ అందుబాటులో ఉంటుంది.ఈ టూత్పేస్ట్ మీ పళ్ళను తెల్లగా చేయడమే కాకుండా, అనేక ఇతర సందర్భాల్లోనూ ఉపయోగపడుతుంది. వాస్తవానికి ఈ టూత్పేస్టును, వంటగది నుంచి లివింగ్ రూమ్ వరకు గల ఇంట్లోని ప్రతి భాగానికి ఉపయోగించవచ్చు, ఆశ్చర్యపోతున్నారు కదా మీరు ?ఈ టూత్పేస్ట్లో బేకింగ్ సోడా అనే మూలపదార్థం ఉన్నందువల్ల, ఇది వస్తువులను ఏ విధంగా నష్టపరచకుండా వాటిపై గల దుమ్మూ, ధూళీ, మచ్చలను తొలగించి, శుభ్రం చేసే లక్షణాలను కేవలం తేలికపాటి రాపిడితోనే కలిగి ఉంటుంది.కొన్ని అత్యవసర పరిస్థితులలో మరకలను తొలగించడానికి, మీరు రెగ్యులర్గా వైట్ టూత్పేస్ట్ను ఉపయోగిస్తారు. వంటగదిని శుభ్రం చేయటానికి మీ స్నేహితుల్లో కొందరు టూత్పేస్ట్ ఉపయోగించడాన్ని మీరు చూసే ఉంటారు.ఈరోజు ఈ వ్యాసం ద్వారా, మీ బోల్ట్-స్కై టూత్పేస్ట్ వల్ల కలిగే ఇతర ఉపయోగాల జాబితాను మీ ముందుకు తీసుకువచ్చింది. అవేమిటో తెలుసుకుంటే, మీరు కూడా వెంటనే వాటిని ప్రయత్నించాలనుకుంటారు.టూత్పేస్టు వల్ల కలిగే మరికొన్ని ఉపయోగాలన్నీ కూడా, రోజులో మీరు శుభ్రపరిచేందుకు వినియోగించే మీ శారీరక శక్తిని తక్కువ చేస్తుంది.1. మీ వైట్ టీషర్ట్ మీద మరకలను తొలగిస్తుంది :1. మీ వైట్ టీషర్ట్ మీద మరకలను తొలగిస్తుంది :లిప్స్టిక్, ఇంకు మరకలు వంటివి తరచుగా మీ వైట్ షర్ట్ను బాధిస్తున్నాయి. బీరువాలో అట్టడుగున దాచబడిన మీ తెల్లని బట్టలపై ఉన్న మరకలను నివారించడంలో టూత్పేస్టు బాగా ఉపయోగపడుతుంది. లిప్స్టిక్, ఇంకు మరకలను కలిగిన ప్రదేశాలలో తగినంత టూత్ పేస్ట్ను అప్లై చేసి, నెమ్మదుగా రుద్దుతూ వాష్ చేయండి. ఇలా తెల్లని వస్త్రాలపై ఉన్న మరకలు పూర్తిగా పోయే వరకు ఇదే పద్ధతిని రిపీట్ చేయండి.2. కీటకాల కాటు నుంచి ఉపశమనం పొందండి :2. కీటకాల కాటు నుంచి ఉపశమనం పొందండి :కీటకాల సంఖ్య పెరిగే సీజన్లో మనము ఉన్నాము. అలాంటి కీటకాలు మనల్ని



కాటు వేసిన సమయంలో మన శరీరము దురద సంచలనాన్ని కలిగి చర్మం విసుగు చెందేలా చేస్తోంది. కాబట్టి మీరు ఇలాంటి సమస్యల నుంచి బయటపడటం కోసం పురుగులు కాటు వేసిన చోట కొద్దిగా టూత్ పేస్ట్ను అప్లై చేయండి.

## సన్‌రైజర్స్ క్రికెటర్ పెద్ద మనసు

హైదరాబాద్: సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాడు శ్రీవత్స్ గోస్వామి పెద్ద మనసు చాటుకున్నాడు. కరోనా కట్టడికై భారత్ సాగిస్తున్న పోరులో భాగంగా తన వంతు సాయం చేశాడు. దేశంలో ఆక్సిజన్ కొరతతో కోవిడ్ బాధితులు అల్లాడుతున్న వేళ ప్రాణవాయువు సరఫరాకై రూ. 90 వేలు విరాళమిచ్చాడు. ఈ విషయాన్ని డొనాటేకర్ట్ అనే చారిటి ఆర్గనైజేషన్ ట్విటర్ వేదికగా వెల్లడించింది. అత్యవసర సమయంలో సాయం చేసేందుకు ముందుకు వచ్చినందుకు ధన్యవాదాలు తెలిపింది. ఇందుకు స్పందించిన శ్రీవత్స్.. కష్ట సమయంలో అందరూ ఏకతాటిపై నిలబడాలని, వీలైనంత మేర సాయం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశాడు. కాగా ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆసీస్ పేసర్ పాట్ కమిన్స్ తన వంతు సాయంగా 50 వేల డాలర్లను పీఎం కేర్స్‌ఫండ్‌కు అందజేసిన విషయం తెలిసిందే. అదే విధంగా, ఆసీస్ మాజీ పేసర్ బ్రెట్ లీ సైతం1 బిట్‌కాయిన్‌ను విరాళంగా అందించనున్నట్లు తెలిపాడు. ఈ నేపథ్యంలో కరోనా సెకండ్‌వేవ్‌తో భారత్ అల్లాడుతున్న వేళ సాయం చేసేందుకు ముందుకు వచ్చిన తొలి స్వదేశీ క్రికెటర్‌గా శ్రీవత్స్ నిలిచాడు.

# 'తగ్గేదే..లే' అంటూ రికార్డులు బ్రేక్ చేసిన పుష్పారాజ్..!





టాలీవుడ్ స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న భారీ చిత్రం పుష్ప. ఇటీవలే అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం సినిమా నుండి హీరో ఇంట్రడక్షన్ వీడియో రిలీజ్ చేసింది. ప్రస్తుతం పుష్పారాజ్ ఇంట్రడక్షన్ వీడియో యూట్యూబ్ వేదికగా రికార్డులు క్రియేట్ చేస్తోంది. ఇప్పటికే ఫుల్ ఫామ్ లో ఉన్నటువంటి పుష్పారాజ్ ఇంట్రడక్షన్ వీడియో.. కేవలం విడుదలైన 20 రోజుల్లో 50 మిలియన్స్ వ్యూస్ రాబట్టి టాలీవుడ్ లోనే ఫాస్ట్ 50మిలియన్స్ బ్రేక్ చేసిన సినిమాగా నిలిచింది. ఇప్పటికి 50మిలియన్స్ వ్యూస్ తో పాటు 1.2మిలియన్స్ పైగా లైక్స్ దక్కించుకొని ట్రెండింగ్ లో ఉంది. ప్రస్తుతం అల్లు అర్జున్ కెరీర్లోనే అత్యధిక వ్యూస్ సొంతం చేసుకున్న వీడియోగా పుష్పారాజ్ ఇంట్రడక్షన్ రికార్డు దక్కించుకుంది.పుష్పారాజ్ వీడియో యూట్యూబ్ ట్రెండింగ్ అగ్రస్థానంలో ఉండటం విశేషం. "ది ఇంట్రడక్షన్ ఆఫ్ పుష్పారాజ్" వీడియోతో సుకుమార్ బృందం అల్లు ఫ్యాన్స్ కు అదిరిపోయే ట్రీట్ ఇచ్చిందని చెప్పాలి. అయితే యూట్యూబ్ ఇంట్రడక్షన్ వీడియోలలో పుష్పారాజ్ స్టార్ హీరోలను బీట్ చేసింది. ఈ వీడియో సోషల్ మీడియాలో తగ్గేదేలే అంటూ రికార్డులు వెనకేసుకుంటుంది. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను మైత్రి మూవీస్ వారు భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు.

పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాలో అల్లు అర్జున్ సరసన రష్మిక మందన హీరోయిన్ గా నటిస్తోంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా అడవిలో ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో తెరకెక్కుతోంది. ఆగష్టు 13న సినిమా థియేట్రికల్ రిలీజ్ కాబోతుంది.


# మళ్లీ అదే సీన్ రిపీట్ అవుతోంది.. మరి ఇప్పుడు వాళ్ళ పరిస్థితి..?

కరోనా వల్ల గతేడాది సినీ వినోదానికి దూరమైన జనాలు ఈ ఏడాది ప్రారంభంలో సినిమాల మీద ఆసక్తి కనబరుస్తూ థియేటర్లకు తరలి వచ్చారు. ఫలితంగా చాలా సినిమాలు హిట్ టాక్ తెచ్చుకోవడంతోపాటు బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించాయి. దీంతో సినీ ఇండస్ట్రీకి మళ్లీ పాత రోజులు వచ్చాయని అందరూ సంబరపడిపోయారు. పరిస్థితులు సద్దుమణిగినట్లేనని టాలీవుడ్ లో ఉన్న పెద్ద బ్యానర్లు ఒక్కోటి దాదాపు 4 నుంచి 9 సినిమాలు చేయడానికి తగిన ఏర్పాట్లు చేసుకున్నాయి. అడ్వాన్సులు ఆఫీసులు స్టాఫ్ అంటూ ఖర్చు పెట్టడం మొదలుపెట్టాయి. అయితే ఈ సంతోషం ఎక్కువకాలం నిలవలేదు. ఈసారి కరోనా సెకండ్ వేవ్ రాక ఇప్పుడు అందరికీ చిక్కులు తెచ్చిపెట్టింది.గీతా ఆర్ట్స్ మరియు అనుబంధ సంస్థ జీఏ2 బ్యానర్స్ లో ప్రస్తుతం నాలుగు సినిమాలు నిర్మాణంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే షూటింగ్ కంప్లీట్ చేసుకున్న 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' సినిమాతో పాటుగా '18 పేజెస్' - 'పక్కా కమర్షియల్' - అల్లు శిరీష్ కొత్త సినిమా రన్నింగ్ లో ఉన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ వారు తమ బ్యానర్ లో ఇప్పటికే 9 క్రేజీ ప్రాజెక్టులను ప్రకటించారు. ఇండస్ట్రీలో ఉన్న స్టార్ హీరోలందరితో సినిమాలు మొదలుపెట్టేశారు. హారిక అండ్ హాసిని మరియు సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో మూడు సినిమాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. యూవీ క్రియేషన్స్ లో ఏకంగా పది సినిమాలు లైన్ అప్ లో ఉన్నాయని సమాచారం. దిల్ రాజు కాంపౌండ్ లో 5 సినిమాల పనులు జరుగుతున్నాయి. ఇలా పెద్ద బ్యానర్స్ అన్నీ కొత్త సినిమాలను రూపొందిస్తున్నారు.అయితే ఇప్పుడు కరోనా సెకండ్ వేవ్ మరింత విజృంభించడంతో సినిమా ఇండస్ట్రీకి గడ్డు రోజులు




మొదలయ్యాయి. షూటింగ్స్ ఆగిపోతున్నాయి.. థియేటర్లు మూతపడుతున్నాయి.. సినిమాలు వాయిదా పడుతున్నాయి. థియేటర్స్ ఓపెన్ ఉండి సినిమాలు రన్ అవుతుంటే ఇన్కమ్ రొటేట్ అవుతూ ఉంటుంది. కానీ ఇప్పుడప్పుడే ఆ పరిస్థితులు కనిపించడం లేదని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. దీంతో గతేడాది మాదిరి మళ్ళీ టెన్షన్ పడుతున్న ఈ బ్యానర్స్ లో కాస్ట్ కట్టింగ్ పెట్టే ఆలోచన కనిపిస్తున్నట్లుగా ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.

# నెటిజన్ కౌంటర్.. తాప్సీ ఎన్ కౌంటర్!



సోషల్ మీడియా వేదికగా.. ప్రజలకు ఏదో విధంగా మంచి సలహాలు ఇచ్చే వారు ఉన్నట్టే.. పనిలేని సొల్లు బ్యాచ్ కూడా ఎక్కువగానే ఉంది. నిజం చెప్పాలంటే.. వీళ్ల సంఖ్యే అధికంగా ఉంది. వీళ్లు చేసేది ఏమీ ఉండదుగానీ.. ఏదో ఒకటి చేస్తున్నవారిపై పనికిమాలిన కామెంట్లు చేస్తూ ఉంటారు. హీరోయిన్ తాప్సీ విషయంలో ఇదే తరహా కామెంట్ చేస్తే.. ఎన్ కౌంటర్ చేసిపారేసింది.కరోనా సెంకడ్ వేవ్ విజృంభణతో దేశం అల్లకల్లోలమవుతోంది. ప్రధానంగా ఆక్సీజన్ దొరక్క వేలాది ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. రెమ్ డెసివర్ వంటి మందుల కొరత కూడా వేధిస్తుండడంతో అన్యాయంగా చనిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఓ ట్వీట్ చేసింది తాప్సీ.ఆ ట్వీట్లో.. ఆక్సీజన్ ఎక్కడ అందుబాటులో ఉందో మందులు ఎక్కడ లభిస్తాయో అనే వివరాలను తెలిపింది. వాటిని అందించే వారి డీటెయిల్స్ ను పోస్టులో రాసింది. అవసరమైన వారు సహాయం పొందవచ్చనే ఉద్దేశంతో ఈ పోస్టు చేసింది.దీనికి ఓ నెటిజన్ తాప్సీని కామెంట్ చేశాడు. "ఇంట్లో కూర్చుని ట్వీట్లు చేసే బదులు.. నీ కారు వాళ్లకు ఇవ్వొచ్చుగా. దాంతో వాళ్లు పని చేసుకుంటారు" అంటూ కామెంట్ చేశాడు. దీనికి తాప్సీ ధీటుగా బదులిచ్చింది. ఇలాంటి చెత్త కామెంట్లు చేసి నా టైమ్ వేస్టు చేయొద్దు. అని రీప్లే ఇచ్చింది. తద్వారా.. పనీపాటా లేని ఆవారా బ్యాచ్ కు ఇక్కడ చోటు లేదని చెప్పింది.

# లాల్ ఫ్యాన్స్ నిరాశ.. మల్లూ పాన్ ఇండియాపై సెకండ్ వేవ్ పంచ్

సూపర్ స్టార్ మోహన్ లాల్ .. కీర్తి సురేష్ తదితరులు నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'మరక్కర్: అరబిక్కడలింటే సింహమ్' ఆగస్టుకి వాయిదా పడింది. అరేబియన్ సముద్రంలో సింహంలా సంచరించిన ఒక గొప్ప వీరుడి కథతో ఈ సినిమా తెరకెక్కుతోంది. మోహన్ లాల్ ఇందులో టైటిల్ రోల్ పోషిస్తున్న సంగతి తెలిసిందే. నాగార్జున- సునీల్ శెట్టి- పరేష్ రావల్ లాంటి ప్రముఖ స్టార్లు ఈ చిత్రంలో నటించారు. చిత్రీకరణ సహా నిర్మాణానంతర పనుల్ని పూర్తి చేశారు. తెలుగు-తమిళం-మలయాళం-హిందీలో ఈ చిత్రం పాన్ ఇండియా కేటగిరీలో మే 13న విడుదల కావాల్సి ఉండగా.. సెకండ్ వేవ్ కోవిడ్ అంతా మార్చేసింది.ఈ మూవీని మొదట 2020 మార్చిలో విడుదలకు ప్లాన్ చేయగా.. అప్పట్లో కోవిడ్ 19 మహమ్మారి వ్యాప్తి చెందడంతో థియేటర్లు మూసివేయాల్సి వచ్చింది. ఆ తర్వాత 2021 మే 13 న మరక్కర్ సినిమాహాళ్లలో రిలీజవుతుందని




తరువాత ప్రకటించారు. అయితే ఇప్పుడు సెకండ్ వేవ్ మరో పంచ్ వేసింది. కోవిడ్ 19కేసుల సంఖ్యల పెరుగుదలను పరిశీలించాక నిర్మాత ఆంటోనీ పెరుంబవూర్ ఈ చిత్రం విడుదలను ఆగస్టు 12 కి మార్చామని ప్రకటించారు.ఈ సినిమాతో పాటు ఫహద్ ఫాజిల్ కథానాయకుడిగా మహేష్ నారాయణన్ దర్శకత్వం వహించిన 'మాలిక్' కూడా మే 13 న విడుదల కానుంది. రాష్ట్రంలో ఇప్పుడు థియేటర్లు మూసివేయడంతో ఈద్ విడుదలల పై సందేహాలు నెలకొన్నాయి. మునుముందు తెలుగులో రిలీజ్ కానున్న పాన్ ఇండియా సినిమాల రిలీజ్ తేదీలపైనా రకరకాల సందిగ్ధతలు నెలకొన్న సంగతి తెలిసిందే.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**